

పుంగనూరులో నామినేషన్ సందర్భంగా వైసీపీ జరిపిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో హింసకు తావులేకుండా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారెవరైనా చట్ట ప్రకారం చర్యలు ఎదుర్కోవాలి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శనివారం 17.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 177 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# నామినేషన్ల వేళ.. రణరంగం



- అన్నమయ్య జిల్లాలో టీడీపీ-వైకాపా శ్రేణుల ఘర్షణలు
- పుంగనూరులో రాళ్లదాడి.. పలువురికి గాయాలు
- రాయచోటిలో పరస్పర దాడులు.. కార్లకు నిప్పు
- కార్యాలయంపై దాడి.. పోలీసు వాహనమూ ధ్వంసం
- ఉద్రిక్తతలతో భారీగా మోహరించిన పోలీసు బలగాలు

పుంగనూరు (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజే అన్నమయ్య జిల్లాలో రాజకీయ ఘర్షణలు కలకలం రేపాయి. పుంగనూరులో టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య రాళ్లదాడి జరగ్గా.. రాయచోటిలో పరస్పర దాడులు, వాహనాల దహనం, కార్యాలయంపై నిప్పు పెట్టడం ఉద్రిక్తతలకు దారితీశాయి. రెండు ఘటనల్లో పలువురు గాయపడగా.. పెద్ద సంఖ్యలో వాహనాలు ధ్వంసమయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు.
స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల తొలిరోజే అన్నమయ్య జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పుంగనూరులో కూటమి, వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు రక్తసిక్తంగా మారింది. టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గాలు ఒకేసారి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా వారి మధ్య వాగ్వాదం చెలరేగింది. రెండు వర్గాలూ పరస్పరం రాళ్లదాడి చేసుకున్నారు. ఘటనలో పలువురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు కాగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. బారికేడ్ల మీదుగా: అన్నమయ్య జిల్లా పుంగనూరులో నామినేషన్ల దాఖలు తొలిరోజు యుద్ధక్షేత్రాన్ని తలపించింది. నామినేషన్ల దాఖలు వేళ టీడీపీ, వైఎస్సార్సీపీ వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వైఎస్సార్సీపీ నేత, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి భారీ కాన్వాయ్‌తో అభ్యర్థులను, భారీ బలగాన్ని వెంటబెట్టుకొని ఎన్నికల అధికారి కార్యాలయానికి బయల్దేరారు. మరోవైపు తెలుగు దేశం అభ్యర్థులు కూడా కొందరు నామినేషన్లు వేసేందుకు కార్యాలయానికి వెళ్లారు. ఎంపీ మిథున్ రెడ్డి ఎన్నికల అధికారి కార్యాలయంలోకి వెళ్లడం నిబంధనలకు విరుద్ధమంటూ టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు మిథున్ రెడ్డిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మిథున్ రెడ్డి పోలీసుల్ని లెక్కచేయకుండా తన వాహనశ్రేణిని బారికేడ్ల మీదుగా తీసుకెళ్లారు. ఈ క్రమంలో భద్రత బలగాల్లో ఉన్న ఓ పోలీసుకు గాయాలయ్యాయని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ వెల్లడించారు.

2 లో



## నామినేషన్లను అడ్డుకుంటారా?

- వైకాపా దాడులపై అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం
- కారుతో కార్యకర్తలను ఢీకొడతారా?
- మహిళలపై దాడులు.. నామినేషన్ పత్రాల చించివేత
- భూమన, మిథున్‌రెడ్డి వ్యవహారాలపై విచారణకు డిమాండ్

2 లో

## రాయచోటి ప్రగతిపై సవాల్

కార్యకర్తలను బలిపశువులను చేయొద్దు

శ్రీకాంత్‌రెడ్డికి మంత్రి మండిపల్లి హితవు

వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధిపై చర్చకు రావాలి

ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదు

2 లో





## ఎన్నికల ఖర్చుపై నిఘా

- అభ్యర్థుల వ్యయంపై నిరంతర పర్యవేక్షణ
- పరిమితి దాటితే చర్యలు తప్పవు
- ఫలితాలొచ్చిన 45 రోజుల్లో ఖర్చుల లెక్కలు ఇవ్వాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించిన పరిమితికి మించి ఖర్చు

2 లో

## పుంగనూరు దాడిపై చర్యలు తీసుకోవాలి

- ఎంపీ మిథున్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలకు ఆలపాటి డిమాండ్
- ఘటనపై సమగ్ర విచారణ జరపాలి
- ఎన్నికల్లో హింసకు తావుండకూడదు
- బాధ్యులెవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ

2 లో



## అందరికీ ఆనందం.. ఆదాయం.. ఆరోగ్యం



- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దుర్గమ్మను ప్రార్థించా
- ప్రజల్లో పేదరికం పోవాలి.. జీవన ప్రమాణాలు మెరుగుపడాలి
- ఇంద్రకీలాద్రిపై సీఎం చంద్రబాబు దంపతుల ప్రత్యేక పూజలు

2 లో

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దుర్గమ్మను ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం కలగాలని కోరుకున్నానన్నారు. ప్రజల్లో పేదరికం తొలగిపోయి, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

**వేదమంత్రాల నడుమ పూజలు :** చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రికి చేరుకోగా ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## సాయికృష్ణ మృతి కేసు సీబీఐకి



- సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలి
- నాలుగు వారాల్లో తల్లికి రూ.25 లక్షల పరిహారం
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ మృతి కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సాయికృష్ణ మరణానికి దారితీసిన పరిస్థితులు, ఘటనకు బాధ్యులైన అధికారులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తక్షణమే కేసు నమోదు చేయాలని సీబీఐని ఆదేశించింది. దర్యాప్తు బాధ్యతలను సంస్థలోని సీనియర్ అధికారికి అప్పగించాలని సీబీఐ డైరెక్టర్‌కు సూచించింది. విచారణలో జాప్యం చేయకుండా సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి మిగతా 3లో...

## పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు



- ఈ నెల 23న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- సీఎంఆర్ఎల్ మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం
- హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన విజయన్

3 లో

## సేవా మార్గంలో ఎన్టీఆర్ ట్రస్ట్




- మహిళల స్వయంఉపాధికి ఉచిత శిక్షణ
- తలసేమియా చిన్నారులకు అండగా ప్రత్యేక కేంద్రం
- రక్తదానంతో ప్రాణాలకు భరోసా
- సేవలో ప్రజలూ భాగస్వాములు కావాలి: భువనేశ్వరి

2 లో

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయంకృషితో ఉన్నత స్థాయికి చేరుకోవడమే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమని ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. మహిళలకు ఉచిత శిక్షణ అందిస్తూ ఆర్థిక ప్రగతికి తోడ్పడుతున్నామని, స్త్రీశక్తి ద్వారా వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. విజయవాడలోని స్టెల్లా కళాశాల సమీపంలో నూతనంగా

## మిథున్‌రెడ్డిపై ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు



- పుంగనూరు, రాయచోటి, తిరుపతి, ధర్మవరంలో హింసాత్మక ఘటనలు
- నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎన్నికల సంఘానికి వర్ల రామయ్య, అశోక్‌బాబు వినతి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. పుంగనూరు, రాయచోటి, తిరుపతి, ధర్మవరం- 3లో...

## విహారయాత్రలో పెను విషాదం



- గొల్లపల్లి జలాశయంలో ఐదుగురు మహిళల మృతి
- ప్రమాదవశాత్తూ నీట మునిగి దుర్మరణం
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం, డిప్యూటీ సీఎం

పెనుకొండ (జర్నలిస్ట్ ఫైల్) : సరదాగా గడిపేందుకు జలాశయం వద్దకు వెళ్లిన ఐదుగురు మహిళలు ప్రమాదవశాత్తూ నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి జలాశయంలో శుక్రవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతులంతా పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఒకే ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

**ఒకరి తర్వాత ఒకరు నీటిలోకి :** దర్గాపేటకు చెందిన గాయత్రమ్మ కుమార్తె అశ్విని ఇటీవల బెంగళూరు నుంచి స్వగ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో గాయత్రమ్మ తన కుమార్తె అశ్విని, ఆమె స్నేహితులు పుష్పలత, షేక్ హసీనా, మిగతా 3లో...

# నామినేషన్ల వేళ.. రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

'మిథున్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రంలో ఆయన రిటర్నింగ్ ఆఫీసర్‌ను బెదిరించటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీతో పాటు వచ్చిన ఆయన అనుచరులు, వైఎస్సార్సీపీ నాయకులు ఆందోళన చేస్తున్న టీడీపీ నేతలపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో పుంగనూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు మధు రాయల్ సహా మరికొందరు నాయకులు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. రాళ్ల దాడిలో మధు రాయల్ తల పగలడంతో తీవ్ర రక్తస్రావమై ఆయన అపస్మారక స్థితికి చేరుకున్నారు. పోలీసులు, నాయకులు హుటాహుటిన ఆయన్ను ఆసుపత్రికి తరలించారు.

ఆందోళనకు పిలుపు: పోలీసులు అడ్డగిస్తున్నా ఆగకుండా. వాహనాలతో వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించాయి. మిథున్ రెడ్డి వాహనశ్రేణిలో మద్యం సీసాలు బయటపడటం కలకలం రేపింది. మిథున్ రెడ్డికి మద్దతుగా భారీగా వైసీపీ నాయకులు, ఆయన అనుచరగణం చేరుకొని టీడీపీ శ్రేణులపై దాడులకు యత్నించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇరువర్గాలూ పరస్పర నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్ధరిల్లింది. దాడులు ఉద్ధృతం కాకుండా పోలీసులు కూడా భారీ సంఖ్యలో అక్కడికి రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వైఎస్సార్సీపీ దాడులను నిరసిస్తూ టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు పిలుపునివ్వడంతో పరిస్థితులు అదుపుదాటకుండా పోలీసులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు.

15 కార్లు ధ్వంసం: మరోవైపు రాయచోటిలో భీతావాహ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలూ పరస్పరం రాళ్ల దాడులు చేసుకున్నాయి. రాయచోటిలోని గాచీ కాలనీలో రెండు పార్టీల కార్యకర్తలు కార్లకు పరస్పరం నిప్పు పెట్టుకున్నారు. అక్కడే రెండు పార్టీల కార్యాలయాలు ఉన్నాయి. వైఎస్సార్సీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అప్పటికే వైఎస్సార్సీపీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు చేరుకున్నారు. కాసేపటికే మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. కొద్దిసేపటికే వైఎస్సార్సీపీ శ్రేణులు టీడీపీ కార్యాలయం వైపు దూసుకొచ్చాయి. అక్కడే ఉన్న తెలుగుదేశం కార్యకర్తలతో కవ్వింపు చర్యలకు దిగాయి. ఇరువర్గాల మధ్య మాటలయుద్ధం జరిగింది. రెచ్చిపోయిన వైఎస్సార్సీపీ మూకలు తమతో పాటు తెచ్చుకున్న రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డాయి. కాలనీలో ఉన్న5 కార్లకు వైఎస్సార్సీపీ కార్యకర్తలు నిప్పు పెట్టారు. మరో 15 కార్లను ధ్వంసం చేశారు.

ఘర్షణల్లో వైఎస్సార్సీపీ కార్యాలయంపైనా దాడి చేసి నిప్పు పెట్టారు. వెంటనే అప్రమత్తమైన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఆ సమయంలో కార్యాలయంలోనే ఉన్న వైఎస్సార్సీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి సహా ఇతర నాయకులు, కార్యకర్తలు క్షేమంగా బయటపడ్డారు. ఘటనలో శ్రీకాంత్ రెడ్డి వాహనం ధ్వంసమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరుపార్టీల కార్యకర్తలనూ చెదరగొట్టారు. టీడీపీ కార్యకర్తలే తమ కార్యాలయంపై దాడి చేసి నిప్పు పెట్టారని వైఎస్సార్సీపీ ఆరోపిస్తోంది. వైఎస్సార్సీపీ కార్యకర్తలే నిప్పు పెట్టుకుని తమపై ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ వాదిస్తోంది.

పరిస్థితిని చక్కబెట్టేందుకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకోగా వారి వాహనంపైనా వైఎస్సార్సీపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో సీఐ కారు అద్దం ధ్వంసమైంది. కానిస్టేబుల్ పెంచలయ్యకు గాయాలయ్యాయి. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో పోలీసు బలగాలు ఇరువర్గాలనూ చెదరగొట్టాయి. స్థానిక ఎన్నికలను ఎలాగైనా అడ్డుకోవాలన్న దురుద్దేశంతోనే వైఎస్సార్సీపీ పక్కా ప్రణాళికతో దాడులకు తెగబడుతోందని తెలుగుదేశం ఆరోపిస్తోంది. రాష్ట్రంలో కావాలనే అలజడులు సృష్టిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

# నామినేషన్లను అడ్డుకుంటారా?



**అమరావతి, అక్టోబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్)** : పుంగనూరు, తిరుపతిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కూటమి అభ్యర్థుల నామినేషన్ల అడ్డగింతకు సంబంధించిన ఘటనలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ శ్రేణుల చేసిన దాడులను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియను గుండాగిరితో అడ్డుకోవాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అభ్యర్థులపై దాడులు చేసి, నామినేషన్ పత్రాలు చించేసి ప్రజాతీర్పును మార్చగలమనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మహిళలను గాయపరిచి, వాహనాలను ధ్వంసం చేయడమే వైసీపీ రాజకీయమా అని నిలదీశారు. పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారని, కారుతో ఢీకొట్టి నామినేషన్ల కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడంపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఎంపీగా ఉండి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యక్తి నామినేషన్లనే అడ్డుకుంటారా? గత ప్రభుత్వ హయాంలో సాగించిన గుండాగిరినే ఇప్పుడూ చలామణి చేయాలని చూస్తున్నారా? కారుతో కార్యకర్తలను ఢీకొట్టడం, నాయకులపై దాడులకు దిగడం రాజకీయమా? ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే దౌర్జన్యాలను సహించేది లేదు అని హెచ్చరించారు.

మిథున్‌రెడ్డి కాన్వాయ్‌తో వచ్చిన వ్యక్తులు మద్యం మత్తులో, దాడి చేయాలనే ఉద్దేశంతోనే ప్రాంగణంలోకి ప్రవేశించారని మంత్రి తెలిపారు. టీడీపీ నేత మధురాయల్, అభ్యర్థులు, పోలీసులపై దాడులు, వాహనాల ధ్వంసానికి సంబంధించిన సమాచారాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులపైనే దాడులకు తెగబడితే చట్టమంటే లెక్కలేదా? దాడులకు పాల్పడిన వారితోపాటు వాటిని ప్రోత్సహించిన వారూ చట్టానికి సమాధానం చెప్పాల్సిందే అని స్పష్టం చేశారు. మిథున్‌రెడ్డి ప్రమేయంపై వచ్చిన ఆరోపణలు సహా అన్ని అంశాలపై ఆధారాలను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లో కూటమి అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకోవడం, యువత, మహిళలపై దాడులు జరగడం, పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడినట్లు వచ్చిన వివరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కెనడీనగర్‌లో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న టీడీపీ కార్యకర్త యశోదపై భూమన అనుచరులు దాడి చేసి, పత్రాలు చించేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఒక మహిళ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకొస్తే దాడి చేస్తారా? ఆమె చేతిలోని పత్రాలు చించేయడం ద్వారా మీ రాజకీయ బలహీనతనే బయటపెట్టుకున్నారు. మహిళలపై దాడులు చేసే వారికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అని ధ్వజమెత్తారు. దాడులను బహిరంగంగా ఖండించి, నిష్పక్షపాత విచారణకు సహకరించాల్సిన బాధ్యత వైసీపీ నాయకత్వంపై ఉందన్నారు. ప్రజల ముందుకు వెళ్లి తమ విధానాలు చెప్పుకోవాల్సిన వారు ప్రత్యర్థుల నామినేషన్లనే అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల్లో బలం ఉంటే ఎన్నికల్లో చూపించండి. మహిళలను బెదిరించడం, కార్యకర్తలను కొట్టడం, వాహనాలను ధ్వంసం చేయడం రాజకీయ బలం అనుకుంటున్నారా? ప్రజాస్వామ్యాన్ని మీ దౌర్జన్యాలకు బందీ చేయలేరు అని హెచ్చరించారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరిపైనా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు కోరారు. దాడులను ప్రోత్సహించిన వారి పాత్ర ఉంటే దానినీ ఆధారాలతో నిర్ధారించి చర్యలు చేపట్టాలన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించి, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా సాగేలా చూడాలని సూచించారు. గాయపడిన యశోదతోపాటు బాధిత కార్యకర్తలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

# సేవా మార్గంలో ఎన్టీఆర్ ట్రస్ట్

(మొదటి పేజీ తరువాయి)



నిర్మించిన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తలసేమియా కేర్ సెంటర్, రక్తనిధి కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గత ఏడాది శంకుస్థాపన చేసిన ఈ భవనాల నిర్మాణాన్ని ట్రస్ట్ పూర్తి చేసింది. విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ప్రాణాలకు భరోసా రక్తదానం** : రక్తదానం మరో మనిషికి జీవితంపై భరోసా కల్పిస్తుందని భువనేశ్వరి పేర్కొన్నారు. సమాజానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను నిలబెడుతుందని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తనకు సహకరిస్తున్న దాతలు, సంస్థలు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**29 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు** : తన తండ్రి నందమూరి తారకరామారావు జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని భువనేశ్వరి గుర్తుచేశారు. సమాజంలో చివరి వ్యక్తి కూడా బాగుండాలన్నది ఆయన ఆకాంక్ష అని, ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటైందని తెలిపారు. గత 29 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు.

ఎన్టీఆర్ సంజీవని ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మొబైల్ వైద్య వాహనాలతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా పలు గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలను సంఖ్యలతో కాకుండా.. వాటి వల్ల ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుతో అంచనా వేయాలని సూచించారు. సమాజ సేవలో ప్రజలు కూడా ట్రస్ట్‌తో కలిసి భాగస్వాములు కావాలని కోరారు.

**తలసేమియా బాధితులకు అండగా..** : తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు గత ఏడాది నుంచే ఉచితంగా రక్తం అందించే సేవలను ప్రారంభించామని భువనేశ్వరి తెలిపారు. ఇప్పుడు విజయవాడలో ప్రత్యేక కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరంలో ఇప్పటికే రక్తనిధి కేంద్రాలు పనిచేస్తున్నాయని చెప్పారు. విజయవాడ వంటి నగరంలో నాణ్యమైన రక్తనిధి కేంద్రం అవసరాన్ని గుర్తించి కొత్త కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. తలసేమియా బాధితులకు అండగా నిలిచేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

**విద్యతో బంగారు భవిష్యత్తు** : మంచి విద్య అంటే కేవలం సర్టిఫికెట్ ఇవ్వడం కాదని, ఒకరి జీవితానికి బంగారు భవిష్యత్తును అందించడమని భువనేశ్వరి అన్నారు. ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే వారి కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వరదలు, తుపాన్లు, ఇతర విపత్తుల సమయంలో బాధితులకు ట్రస్ట్ అండగా నిలిచిందని తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు అందరూ సహకరించాలని, రక్తదానం ప్రాధాన్యాన్ని గుర్తించి ఇతరులనూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# పుంగనూరు దాడిపై చర్యలు తీసుకోవాలి



**తెనాలి, అక్టోబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్)** : పుంగనూరులో ఎన్నికల నామినేషన్ సందర్భంగా జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో హింసాత్మక ఘటనలకు తావులేకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి ఒక్కరికీ ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, నామినేషన్ ప్రక్రియకు ఆటంకం కలిగించడం లేదా దాడులకు పాల్పడడం వంటి ఘటనలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆయన కోరారు. వైసీపీ కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో ఇంకా వైసీపీ ప్రభుత్వం కొనసాగుతున్నట్లుగా గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. "ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు. ఎన్నికల ప్రక్రియలో దాడులకు పాల్పడే వారిపై చట్టం తన పని తాను చేసుకుపోవాలి. బాధ్యులెవరైనా సరే, వాస్తవాలను నిర్ధారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి" అని ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు అప్పసాని రాజేష్, కత్తెర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి ప్రగతిపై సవాల్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న రాయచోటిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు తెలిపారు. రాయచోటిలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా గత రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు.

గత 25 ఏళ్లలో పరిష్కారానికి నోచుకోని తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.450 కోట్లతో ఆరు మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టు పనులు చేపట్టామని, శ్రీనివాసపురం రిజర్వాయర్ నిర్మాణానికి సుమారు రూ.420 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

రాయచోటికి వచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం, సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గాలివీడు ప్రాంతంలోనూ అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకం నిధులను సద్వినియోగం చేయలేదని, అప్పట్లో చేపట్టిన పలు తాగునీరు, సాగునీటి పనులు అసంపూర్తిగా మిగిలాయని మంత్రి విమర్శించారు. మైనారిటీల కోసం శంకుస్థాపన చేసిన పనుల పురోగతిపై గత పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి, ఇతర మౌలిక వసతుల కల్పన విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని కోరారు.

**కార్యకర్తలను రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు** : మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను మంత్రి ఖండించారు. ఆధారాలు లేకుండా నామినేషన్ అభ్యర్థులను బెదిరించారని ఆరోపించడం సరికాదన్నారు. వైసీపీ కార్యకర్తలను అనవసర వివాదాల్లోకి నెట్టి వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని హితవు పలికారు. రాజకీయ కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించాలని సూచించారు.

హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ఎవరూ ప్రోత్సహించకూడదని మంత్రి పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా కలిసిమెలిసి జీవించేలా రాజకీయ నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

22 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రజల మద్దతుతోనే తాను ఎదిగానని మంత్రి తెలిపారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం కంటే రాయచోటికి చేసిన అభివృద్ధి పనులపై చర్చకు రావాలని శ్రీకాంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. తన పనుల వివరాలను ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నానని, గత పాలకులు కూడా తమ హయాంలో చేసిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**ఎన్నికల వరకు రాయచోటిలోనే ఉంటా...** : రాయచోటి మున్సిపల్ ఎన్నికల నుంచి గ్రామ, వార్డు స్థాయి ఎన్నికల వరకు నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజలకు, కూటమి కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు స్పష్టం చేశారు. కార్యకర్తలకు అండగా నిలబడటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, తాగునీరు, సాగునీరు, రహదారులు, పట్టణాభివృద్ధి వంటి అంశాలే తనకు ప్రధానమని పేర్కొంటూ.. రాజకీయ విమర్శలకు సమాధానం అభివృద్ధి పనుల ద్వారానే చెబుతానని మంత్రి వెల్లడించారు.

# స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులను సమాయత్తం చేయడమే లక్ష్యం

- **గన్నవరం విమానాశ్రయంలో బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం**



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, ఎన్నికల వ్యూహాన్ని రూపొందించడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో విజయవాడకు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ అరవింద్ భదోరియా, జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్‌కు గన్నవరం విమానాశ్రయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో పాటు పలువురు బీజేపీ నాయకులు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులకు ఆత్మీయ స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై నాయకులకు స్వాగతం తెలిపారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ పర్యటనలో పార్టీ నాయకత్వం దృష్టి సారించనుంది. గ్రామ, మండల స్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల కార్యాచరణపై నాయకులతో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను పూర్తి స్థాయిలో సిద్ధం చేయడంతో పాటు, ఎన్డీఏ కూటమి సమన్వయంతో క్షేత్రస్థాయిలో బలమైన ఎన్నికల కార్యాచరణ రూపొందించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని బీజేపీ నాయకులు తెలిపారు. జాతీయ, రాష్ట్ర నాయకుల పర్యటనతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొన్నట్లు పేర్కొన్నారు.

# అందరికీ ఆనందం.. ఆదాయం.. ఆరోగ్యం



(మొదటి పేజీ తరువాయి)

ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాదశర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం పట్టువస్త్రాలు, సుమంగళి ద్రవ్యాలను తీసుకుని అమ్మవారి ఆలయంలోకి వెళ్లారు. వేదమంత్రోచ్చరణల నడుమ అంతరాలయంలోకి చేరుకుని సరస్వతీదేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మకు షోడశోపచార పూజలు నిర్వహించారు. సీఎం, ఆయన కుటుంబ సభ్యుల గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

**అమరావతి నిర్మాణం భవ్యంగా సాగాలి** : రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రాజెక్టులు సత్ఫలితాలివ్వాలని పండితులు సంకల్పం చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం దివ్యంగా, భవ్యంగా సాగాలని, పాలనలో ఎలాంటి అవరోధాలు, ప్రతికూలతలు ఎదురుకాకుండా పాలకులపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం చతుర్వేద ఆశీర్వచనం చేసి ప్రసాదాన్ని అందజేశారు. దేవాదాయశాఖ తరఫున అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ పాలకమండలి ఛైర్మన్, అధికారులు సీఎం దంపతులకు అందించారు.

**భక్తులతో సీఎం ముచ్చట్లు** : దర్శనం అనంతరం క్షేత్రపాలకులు అభయ ఆంజనేయస్వామి, అపరాజితాదేవిని చంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పురాతన రావిచెట్టుకు నమస్కరించారు. బయట గట్టుపై కూర్చుని ఆలయ శిఖరాన్ని దర్శించి చేతులు జోడించారు. అనంతరం పాలకమండలి సభ్యులు, ఇతరులతో ఫొటోలు దిగారు. జై దుర్గాభవానీ అంటూ మూడుసార్లు నినదించి రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

**8 లక్షల మందికి అమ్మవారి దర్శనం** : దుర్గమ్మకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, సారె సమర్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహిస్తున్న ఆలయ సిబ్బందిని అభినందించారు. ఇప్పటివరకు 8 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని, నవరాత్రుల్లో మరింత మంది భక్తులు తరలివస్తారని చెప్పారు. ఈ ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. సీఎం దంపతులు సుమారు అరగంటపాటు ఆలయంలో ఉన్నప్పటికీ భక్తుల దర్శనానికి అంతరాయం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖమండపం ముందు క్యూ మినహా మిగిలిన వరుసలను యథావిధిగా కొనసాగించారు. దర్శనం అనంతరం బయటకు వచ్చిన చంద్రబాబు క్యూలైన్లలోని మహిళలతో మాట్లాడారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి ఉత్సాహపరిచారు.

# ఎన్నికల ఖర్చుపై నిఘా



(మొదటి పేజీ తరువాయి)

చేయరాదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు అన్ని జిల్లాలకు వ్యయ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో శుక్రవారం వ్యయ పరిశీలకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అభ్యర్థుల రోజువారీ ఖర్చులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల వ్యయాన్ని నమోదు చేసేందుకు అవసరమైన నిర్దిష్ట నమూనాలను రిటర్నింగ్ అధికారులు అభ్యర్థులకు నిర్ణీత సమయంలో ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45 రోజుల్లోగా పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తన మొత్తం ఎన్నికల ఖర్చుల వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని స్పష్టం చేశారు.

**నిబంధనల ఉల్లంఘనపై నిఘా** : పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి ఏజెంట్లు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పునేఠా సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనల ఉల్లంఘన ఘటనలపై అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# వైసీపీ అరాచకాలను సహించేది లేదు

- స్థానిక ఎన్నికల్లో హింసాత్మక రాజకీయాలకు తావులేదు
- ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో హింసాత్మక రాజకీయాలను సహించేది లేదని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల తొలిరోజే పుంగనూరు, రాయచోటి, తిరుపతి తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగాల్సిన సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు.
పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో వైసీపీ నేతలు కూటమి నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాధవ్ ఆరోపించారు. రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి వాహనంతో కార్యకర్తలను ఢీకొట్టేలా వేగంగా వెళ్లడం, అడ్డుకున్న వారిపై దాడులకు ప్రయత్నించడం వంటి ఘటనలు ఆందోళనకరంగా ఉన్నాయని అన్నారు. అయితే పుంగనూరు ఘటనపై ఇరుపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. తిరుపతిలో మహిళా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు ఆటంకాలు కలిగించారని మాధవ్ ఆరోపించారు. ధర్మవరంలో బీజేపీ శ్రేణులపై వైసీపీ వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన హత్యా రాజకీయాలు, ప్రస్తుతం చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలకు ప్రజల మద్దతు ఉండదని పేర్కొన్నారు.
కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మాధవ్ తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అన్ని స్థానాల్లో ఐక్యంగా పనిచేసి మెజారిటీ సాధించేందుకు కృషి చేస్తుందని, 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్థానిక ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామని అన్నారు.
హింసకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని మాధవ్ కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూనే హింసకు తావులేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రజలను భయపెట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను మానుకోవాలని ప్రతిపక్షానికి సూచించారు.
**పార్టీ నేతలతో మాధవ్ సమావేశం :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుకతో పీవీఎన్ మాధవ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వైఖరి, ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యాలయం విడుదల చేసిన వీడియోలో పేర్కొంది.

## పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు



**కొచ్చి (జర్నలిస్ట్ ఫైల్) :** కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సీఎంఆర్ఎల్ మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ నెల 23న కొచ్చిలోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది.
**సుప్రీంకోర్టును ఆశ్రయించిన విజయన్ :** సీఎంఆర్ఎల్ లంచం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ విజయన్ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లుథ్రా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు తన క్లయింట్‌పై కఠిన చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీజేఐ.. దసరా సెలవుల అనంతరం ఈ నెల 26న విచారణ చేపడతామని తెలిపారు. న్యాయమూర్తులు అందుబాటులో ఉంటే వచ్చే వారం సెలవు రోజుల్లో ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.
**హైకోర్టులో చుక్కెదురు :** తనపై, కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ విజయన్, ఆయన కుమార్తె వీణ టి, ఆమె భర్త పి.ఏ. మహమ్మద్ రియాస్ దాఖలు చేసిన పిటిషన్లకు కేరళ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అక్టోబర్ 9న ఇచ్చిన ఆదేశాలపై అప్పీలు చేసేందుకు వారు చేసిన దరఖాస్తులను డివిజన్ బెంచ్ గురువారం తిరస్కరించింది. అవినీతి కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి వాదనను వినాల్సిన చట్టపరమైన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.
హైకోర్టు ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) ప్రత్యేక దర్యాప్తు విభాగం ఇప్పటికే విజయన్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యవహారంలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఈడీ సమర్పించిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలని అక్టోబర్ 9న హైకోర్టు ఆదేశించింది.
**రూ.3.28 కోట్ల చెల్లింపులపై ఆరోపణలు :** కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) సంస్థ విజయన్ కుమార్తె వీణకు ముడుపులు చెల్లించిందన్న ఆరోపణలు ఈ కేసులో ప్రధానంగా ఉన్నాయి. విజయన్ అల్లుడు, ఎమ్మెల్యే పి.ఏ. మహమ్మద్ రియాస్‌కు సంబంధించిన హవాలా చెల్లింపుల అంశాన్నీ ఈడీ తన నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం.
విజయన్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి తనకు, కుమార్తెకు, ఆమెకు చెందిన సంస్థకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించారన్న ఆరోపణలు ఎఫ్ఐఆర్‌లో ఉన్నాయి. సమాచార సాంకేతిక సలహాలు, మార్కెటింగ్ సేవల పేరుతో సీఎంఆర్ఎల్, ఎంపవర్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వీణకు, ఆమెకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు మొత్తం రూ.3.28 కోట్లు చెల్లించాయని అందులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## విహారయాత్రలో పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి)

అత్తర్ మాహీలతో కలిసి గొల్లపల్లి జలాశయాన్ని సందర్శించేందుకు వెళ్లారు. అక్కడ స్నానం చేసేందుకు నీటిలోకి దిగిన సమయంలో ప్రమాదవశాత్తూ ఒకరి తర్వాత ఒకరు మునిగిపోయారు. ఈత రాకపోవడంతో ఐదుగురూ నీటిలో గల్లంతయ్యారు. కళ్లెదుటే వారు నీట మునగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హాహాకారాలు చేశారు.
**ఒడ్డుకు చేరిన మృతదేహాలు :** సమాచారం అందుకున్న స్థానికులు, మత్స్యకారులు జలాశయం వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఐదుగురి మృతదేహాలను వెలికితీసి ఒడ్డుకు చేర్చారు. పక్కపక్కనే ఉన్న మృతదేహాలను చూసి బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పెనుకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
**సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి :** ఐదుగురు మహిళలు జలాశయంలో మునిగి మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలాశయాన్ని సందర్శించేందుకు వెళ్లిన మహిళలు ప్రమాదవశాత్తూ జారిపడగా.. మత్స్యకారులు గుర్తించి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు వివరించారు.
**బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం :** ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మృతులకు నివాళులర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఒకే ఘటనలో ఐదుగురు మహిళలు మృతి చెందడం వారి కుటుంబాలకు తీరని లోటని, ఈ విషాదాన్ని మాటల్లో వర్ణించలేమని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## సాయికృష్ణ మృతి కేసు సీబీఐకి



(మొదటి పేజీ తరువాయి)

వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ధర్మాసనం పేర్కొంది.
**వారంలోగా రికార్డుల బదిలీ :** కేసుకు సంబంధించిన పూర్తి రికార్డులను వారంలోగా సీబీఐకి బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రత్యేక మెసెంజర్ ద్వారా రికార్డులను నేరుగా సీబీఐ డైరెక్టర్‌కు పంపాలని రాష్ట్ర డీజీపీకి స్పష్టం చేసింది. పోలీసు కస్టడీలో జరిగిన సాయికృష్ణ మృతికి బాధ్యులైన అధికారులపై సర్వీసు నిబంధనల ప్రకారం కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
**తల్లికి రూ.25 లక్షల పరిహారం :** కస్టడీలో కుమారుడిని కోల్పోయిన సాయికృష్ణ తల్లి విజయలక్ష్మికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తీర్పు వెలువడిన తేదీ నుంచి నాలుగు వారాల్లోగా ఈ మొత్తాన్ని ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేయాలని స్పష్టం చేసింది.
పోలీసుల దర్యాప్తుపై నమ్మకం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ విజయలక్ష్మి హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఆమె తరఫు వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్‌ను అనుమతిస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## మిథున్‌రెడ్డిపై ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)



నియోజకవర్గాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై టీడీపీ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేశారు. ఎన్నికల ముసుగులో జరుగుతున్న దాడులపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, శాంతిభద్రతలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.
**పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌తో దాడి చేశారని :** పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌తో టీడీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలను ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు తెలిపారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ప్రజలను, అధికారులను భయాందోళనలకు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల అధికారులను సైతం బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ.. వారికి రక్షణ కల్పించాలని, సంబంధిత నేతల కదలికలపై నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.
**రాయచోటిలో వాహనాలకు నిప్పు :** రాయచోటిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వైఎస్సార్సీపీ నేతలు వ్యవహరించారని టీడీపీ నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారని, టీడీపీ నేతల వాహనాలను తగులబెట్టారని ఆరోపించారు.
**తిరుపతిలో నామినేషన్ పత్రాలు చించివేత :** తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరులు టీడీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో టీడీపీ అభ్యర్థి యశోద చేతికి తీవ్ర గాయాలయ్యాయని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.
**ధర్మవరంలోనూ దాడుల ఆరోపణలు :** ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అనుచరులు దాడులకు పాల్పడుతూ ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో జరిగిన ఘటనలపై క్షేత్రస్థాయి నుంచి వాస్తవ నివేదికలు తెప్పించుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీని కోరారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.
**హింసను సహించేది లేదు: మంత్రులు :** నామినేషన్ల సందర్భంగా వైఎస్సార్సీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మంత్రులు టీజీ భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. అధికారంలో లేనప్పటికీ ఆ పార్టీ నేతల వైఖరి మారలేదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గొడవలతో ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో హింసాత్మక రాజకీయాలను సహించబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. నామినేషన్ల తొలిరోజే వైఎస్సార్సీపీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించిందని విమర్శించారు. ఆ పార్టీ నేతల తీరుకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో దౌర్జన్యాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు భయపడేలా వైఎస్సార్సీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు.

## మహర్నవమికి సెలవు ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

- ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మహర్నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 19, 2026 సోమవారం సెలవు దినంగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం ధన్యవాదాలు తెలిపింది. సచివాలయ ఉద్యోగుల సంఘంతో పాటు ఇతర ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు ప్రభుత్వం సెలవు ప్రకటించిందని సంఘం నాయకులు తెలిపారు.
విజయదశమి నవరాత్రుల్లో భాగంగా వచ్చే మహర్నవమికి ఉన్న విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సెలవు ప్రకటించడం పట్ల ప్రభుత్వ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.
మహర్నవమి సెలవుకు ప్రతిగా నవంబర్ 14, 2026 రెండో శనివారాన్ని పని దినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొందని వారు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.
ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ, జనరల్ సెక్రటరీ నాపా ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

## అవకాశాలను అందిపుచ్చుకోండి



**గుంటూరు, అక్టోబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి ప్రాంతంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని పెట్టుబడిదారులను రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ కోరారు. అమరావతి ఎస్.ఆర్.ఎం విశ్వవిద్యాలయంలో శుక్రవారం సి.ఐ.ఐ ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయని, రాష్ట్ర జి.డి.పికి 35 శాతం సమకూర్చుతుందన్నారు. 2030, 2035, 2047 సంవత్సరాలకు సాధించాల్సిన ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం జరిగిందని చెప్పారు. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి సాధించుటకు ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు . ఈ ప్రాంతంలో వివిధ రకాల 46 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, 26 ఎం.ఎస్.ఎం.ఇ లకు 480 ఎకరాలు కేటాయించడం జరిగిందని వివరించారు. మచిలీపట్నం పోర్టు అనుసంధానంగా ఉంటుందని అన్నారు. ప్రకాశం జిల్లాలో బి.పి.సి.ఎల్ రిఫైనరీ, దోనేపూడిలో భారత డైనమిక్స్ సంస్థ యూనిట్ రానుందని చెప్పారు. పర్యాటక రంగంలో కూడా పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయని తెలిపారు.
పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమరావతి ప్రాంతం ప్రధాన ఆర్థిక అభివృద్ధి ప్రాంతంగా ఎదుగుతుందని చెప్పారు. రాష్ట్ర శిఖలో అమరావతి కిరీటంగా నిలవనుందన్నారు. ఆర్థిక, పెట్టుబడి, సుస్థిర అభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగు వంటి అంశాల కలయికగా అమరావతి ప్రాంతం అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. హై స్పీడ్ ట్రైన్స్ తో పాటు సమీకృత మౌలిక సదుపాయాలు వస్తున్నాయని చెప్పారు. అభివృద్ధికి అవకాశాలు గల రంగాలను గుర్తించడం జరుగుతుందని అన్నారు.
పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ పోర్టులు, షిప్ బిల్డింగ్ క్లస్టర్ లు, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ లు రానున్నాయన్నారు.

## స్థానిక ఎన్నికలపై బీజేపీ అగ్రనేతల ప్రత్యేక భేటీ



- అభ్యర్థుల ఎంపిక, ప్రాంతాల వారీగా ప్రచార వ్యూహంపై చర్చ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అగ్రనేతలు విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై విస్తృతంగా చర్చించారు.
బీజేపీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి అరవింద్ సింగ్ భదోరియా, రెండు తెలుగు రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సమావేశంలో పాల్గొన్నారు.
రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసే స్థానాలు, అభ్యర్థుల ఎంపిక, స్థానికంగా పార్టీ బలాబలాలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. ప్రాంతాల వారీగా ప్రచార కార్యక్రమాలను రూపొందించడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడం, ఎన్నికలకు పార్టీ శ్రేణులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.
స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ, మండల స్థాయిలో పార్టీ సంస్థాగత బలాన్ని పెంచడం, ప్రజల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లడం, అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణను రూపొందించడంపై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## గొల్లపల్లి జలాశయంలో ఐదుగురు మహిళల మృతి తీవ్ర దిగ్భ్రాంతికరం

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీ సత్యసాయి జిల్లాలోని గొల్లపల్లి జలాశయంలో మునిగి ఐదుగురు మహిళలు మృతి చెందిన ఘటనపై ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు.
ఈ ప్రమాదంలో పుష్పలత, గాయత్రమ్మ, అశ్విని, షేక్ హసీనా, అత్తర్ మాహీ ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని మాధవ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.
ఒకే ఘటనలో ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం, అధికారులు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.
జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరుల వద్దకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాధవ్ సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, నీటి వనరుల వద్ద భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

## వైభవంగా శ్రీవారి గరుడసేవ....

**తిరుపతి :** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. గరుడ వాహనంపై లక్ష్మీకాసుల మాలధారిగా శ్రీ మలయప్పస్వామివారిని అలంకరించారు. నాలుగు మాఢవీధుల్లో శ్రీవారిని ఊరేగించారు. గజరాజుల గంభీర నడక, మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోషల నడుమ సాగిన గరుడసేవ వైభవంగా జరిగింది. అడుగడుగునా యాత్రికులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్, చిన్నజీయర్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జెఇఒలు డాక్టర్ ఎ శరత్, పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ జీ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

- నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలి
- వర్షపు నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలి

: జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భ జలాలను పెంపొందించేందుకు విబి జి రామ్ జి కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం వికారాబాద్ మండలం గోదుమగూడ గ్రామంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన ఫామ్ పాండ్స్, బోర్‌వెల్ రీచార్జ్, పైకప్పు నీటి సేకరణ, వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను సమర్థవం తంగా అమలు చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని, అధికారులు సమన్వయం తో పనిచేస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపం చాయతీ ఆవరణల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వికారాబాద్ మండలంలో మంజూరైన 72 ఫామ్ పాండ్స్, 47 బోర్‌వెల్ రీచార్జ్ పనులు, 16 పైకప్పు నీటి సేకరణ పనులు, 119 వ్యక్తిగత, 33 సామూహిక ఇంకుడు గుంతల లక్ష్యాలను అధిగమించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన డీఆర్‌డీఓ శ్రీనివాస్, వికారాబాద్ ఎంపీడీవో వినయ్ కుమార్, సర్పంచ్ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ఇందిర, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐల నుండి ఎస్ఐలుగా పదోన్నతి

- అధికారులకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు




**వికారాబాద్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లాలో పోలీస్ శాఖ లో ఏఎస్ఐల నుంచి ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఐదుగురు పోలీసు అధికారులను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అభినందించారు.పదోన్నతి పొందిన మహమ్మద్ అమ్జద్, టి.సంజీవ్, ఏ.శ్రవణ్ కుమార్, జి.నారాయణ, ఏ.అంబదాస్‌లు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ స్నేహ మేహ్రా సూచించారు. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా బాధ్యతాయుతంగా పనిచేయడంతోపాటు, ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించి పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించాలని తెలిపారు.పదోన్నతి పెరిగిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు.

## బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా సుంకు నవీన్ ముదిరాజ్



**మేడ్చల్ అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్ రూరల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని బీజేవైఎం (భారతీయ జనతా యువమోర్చా) మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధి సుంకు నవీన్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీజేవైఎం మేడ్చల్ రూరల్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సుంకు నవీన్ ముదిరాజ్ వెల్లడించారు.

## భారతరత్న మాజీ రాష్ట్రపతి కలాం విగ్రహ ఆవిష్కరణ

- అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు.మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని గురువారం బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో మహమ్మద్ సలీం ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం సాధారణ కుటుంబంలో జన్మించి తన అసాధారణ ప్రతిభ, కఠోర శ్రమ, అంకితభావంతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించారన్నారు. యువత కలలు కనాలని, ఆ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ఆయన ఇచ్చిన ఇచ్చిన సందేశం ఆచరణీయమని పేర్కొన్నారు.దేశ రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష సేవలందించిన కలాం ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచిం చారు. విద్యార్థులు,యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశాభి వృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, బోరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల రెడ్డి,కొంపల్లి మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్,మాజీ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్,గాజుల సుజాత నాయకులు చంద్రగిరి సతీష్, సాంబశివ రెడ్డి, ఖాదరయ్య,బిక్షపతి,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి దేవిగా నిజాంపేట్ కనకదుర్గమ్మ

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజాంపేట్ సర్కిల్, నిజాంపేట్ గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.5వ రోజు శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారు భక్తులకు మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో నిర్వహించిన చండీ హోమం లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అర్చకులు మాట్లా డుతూ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుంటే అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు,ఉద్యోగం, వ్యాపారంలో అభివృద్ధి జరుగుతుం దన్నారు. ప్రతినిత్యం అమ్మవారికి అభిషేకం,అర్చన, హోమం తో పాటు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు.ప్రతి సంవత్సరం మాదిరిగా అమ్మవారి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తు న్నామని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

## బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

- అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ జగన్



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** బతుకమ్మ కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని జగద్గిరిగుట్ట మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో గల బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల కోసం ఏడు లక్షలు నిధులు కేటాయించామన్నారు.బోర్ వెల్ కోసం 5 లక్షల వెచ్చించామని తెలిపారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా స్థానిక మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ కుంట పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు.తాను కార్పొరేటర్ గా ఎన్నికైన నాటినుండి ప్రతి సంవత్సరం బతుకమ్మ కుంటను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని చెప్పారు. డివిజన్ ఆడపడుచు లందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఈఈ బద్రు,ఏఈ ఆశ,వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్, సోమయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తోక యాదగిరి, మహేందర్,ప్రకాష్, ప్రభాకర్, కుమార స్వామి,నవీన్, సంపత్ రెడ్డి,సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

- మిస్సైల్ మ్యాన్(కలాం) విగ్రహాన్ని ఆవిష్కరించిన హనుమంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** నేటి తరానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయమని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. కలాం జన్మదినాన్ని పురస్కరించుకొని సిఎంసి నిజాంపేట్ సర్కిల్ బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కొలను హనుమంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మిస్సైల్ (కలాం) విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం దేశ రాష్ట్రపతి వంటి అత్యున్నతమైన స్థానంలో ఉన్నప్పటికీ నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. అను పరీక్షల్లో విజయం సాధించి మిస్సైల్ మ్యాన్ గా గుర్తింపు పొందారని చెప్పారు. భారతరత్న,పద్మ విభూషణ్, పద్మభూషణ్ వంటి అవార్డులతో దేశం ఆయనను గౌరవించిందని పేర్కొన్నారు. దేశానికి ఆయన అమూల్యమైన సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలను శ్రీనివాస్ రెడ్డి,స్థానిక డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని, ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్,కే అమృతయ్య, మొయినుద్దీన్, రఫాత్, రామచంద్రనాయక్,సరిత లక్ష్మణ్,ప్రభాకర్ రెడ్డి,అబ్దుల్ నయాబ్,బాలరాజు,ప్రసాద్ గౌడ్, వెంకటేష్ గౌడ్,శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట్ మున్సిపాలిటీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మహిళలతో కలిసి ఆడిపాడిన చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్‌పర్సన్ రజిత రెడ్డి



**మేడ్చల్ అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎల్లంపేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్ అన్నారు. గురువారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వపరంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో చైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్, వైస్ చైర్‌పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి, మహిళా కౌన్సిలర్లు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. మహిళలతో కలిసి చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్‌పర్సన్ రజిత రెడ్డి బతుకమ్మ ఆడిపాడి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే గొప్ప పండుగ అని అన్నారు. ప్రకృతిని, పూలను పూజిస్తూ మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మహిళల ఐక్యతకు, సోదరభావానికి ఈ వేడుకలు నిదర్శనమని అన్నారు. ప్రతి ఒక్కరూ మన పండుగల గొప్పతనాన్ని గుర్తించి, సంప్రదాయాలను గౌరవిస్తూ భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు.

## దుండిగల్ సర్కిల్ ఆఫీస్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ
- దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట మణి కిరణ్



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకట మణి కిరణ్ అన్నారు.గురువారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలతో సందడి చేశారు.బతుకమ్మ పండుగను అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని అధికారులు పేర్కొన్నారు.ఈ వేడుకల్లో ఏఎంసి లక్ష్మయ్య,వార్డు ఆఫీసర్లు,ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కపిలేశ్వర్ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమం..

- వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం



**మల్కాజిగిరి అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ పార్టీ నాయకుడు కపిలేశ్వర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో జరుపుకోవాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కపిలేశ్వర్‌ను శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకలను సామాజిక సేవతో ముడిపెట్టి నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ సభ్యులు సనాది శంకర్, కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బజార్ సాయి, రొట్టెల తరుణ్ కుమార్, చుంకు శ్రీను, చెన్నారెడ్డి, అరుణ్, సయ్యద్ మబ్బు, బాలరాజు యాదవ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ బాధితుడికి మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సాయం



**జవహర్‌నగర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** జవహర్‌నగర్ పరిధిలోని చంద్రపురి కాలనీకి చెందిన డయాలసిస్ బాధితుడు సండం సాయికుమార్‌కు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాయికుమార్ పరిస్థితిని తెలుసుకున్న శ్రీనివాస్ గుప్తా వెంటనే స్పందించారు. బాధితుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆయనకు ధైర్యం చెప్పారు. వైద్య చికిత్సకు మరింత సహాయం అవసరమైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. సాయికుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కృష్ణ బాబా, శ్రీమన్నారాయణ, మాధవ్, శ్రీనివాస్ గౌడ్, సవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన బాసుపల్లి రాంరెడ్డి

- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



**మేడ్చల్ అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు--కిష్టాపూర్ 298వ డివిజన్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు బాసుపల్లి రాంరెడ్డి గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బోయినపల్లిలోని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో రాంరెడ్డి తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రాబోయే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పూడూరు--కిష్టాపూర్ డివిజన్‌లో గులాబీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం బాసుపల్లి రాంరెడ్డి తన అనుచరులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రాంరెడ్డి అనుచరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 17న ఉపాధ్యాయుల సామూహిక నిరాహార దీక్ష

### – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై టీఎస్‌యుటీఎఫ్ పోరుబాట..



హైదరాబాద్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో ఉపాధ్యాయుల సామూహిక నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ ప్రకటించారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టంఅమలుకు ముందు నియమితులైన ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులకు తప్పనిసరి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం–2020ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రాథమిక పాఠశాలలకు నష్టం కలిగించే జీఓనంబర్ 25ను(12–08–2021) సవరించాలనికోరారు. వేతన సవరణ కమిషన్ నివేదికను తెప్పించుకుని, దాని సిఫార్సులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు చేపడుతున్న ఉద్యమంలో భాగంగానిర్వహించే ఈసామూహిక నిరాహారదీక్షను విజయవంతం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగాఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని తమన్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని చావరవి, ఎ.వెంకట్ పిలుపునిచ్చారు.

## చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

– ప్రమాదకర వాటర్ ట్యాంక్‌ను తక్షణమే తొలగించాలి

– హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానికులతో కలిసి ఆకుల సతీష్ ఫిర్యాదు



కుత్బుల్లాపూర్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లిలో ఉన్న సుమర్ చెరువు, లింగోయ్ కుంటలోకి సమీప విద్యాసంస్థల నుంచి మురుగునీరు చేరి చెరువులు కలుషితమవుతున్నాయని, తక్షణమే మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టి, చెరువులను పునరుద్ధరించి, మౌలిక వసతులు కల్పించడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని దూలపల్లి ప్రజలతో కలిసి పూర్తి ఆధారాలతో హైడ్రా కమిషనర్‌కు ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా నిజాంపేట్ సర్కిల్ ప్రగతినగర్‌లోని సాయి కీర్తి లేఔట్‌లో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉండి, పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకముందే దానిని తక్షణమే తొలగించి, పార్కును ప్రజలు నిర్భయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ రెడ్డి, అశ్విన్,ఆర్‌కెబీమ్ రావు, వెంకట్రావు,వీర రెడ్డి, నూఖా రాజు,ఈశ్వర రెడ్డి,సాయి నాథ్ రెడ్డి,రాజా రెడ్డి,దుర్గా,గుర్రాల రమేష్, చింతల నరసింహ, దుర్గం చంద్రశేఖర్, సాయిరాం,గరిష అశ్విన్,చుకయ్య ,పూజారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయంకృషితోనే యువత ఉన్నత స్థానాలకు ఎదగాలి!

### – గంప వెంకటేష్ గుప్తా



కడ్తాల్ అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా స్వయంకృషితో ఎదిగి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్,ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా సూచించారు. కడ్తాల్ పట్టణంలో అమృతం పాండు,గాజుల శ్రీకాంత్ రెడ్డిలు నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ చికెన్ సెంటర్,మక్తమాదారం గేటు వద్ద ఏర్పాటు చేసిన జనరల్ స్టోర్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వ్యాపార నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. నేటి యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. పట్టుదల,కష్టపడి పనిచేసే తత్వం ఉంటే చిన్న వ్యాపారాల ద్వారా కూడా ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. నేడు చిన్న స్థాయిలో ప్రారంభించే వ్యాపారాలే భవిష్యత్తులో పెద్ద సంస్థలుగా అభివృద్ధి చెందే అవకాశముందని,యువత ఆ దిశగా ఆలోచించి ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్,నరసింహ గౌడ్,ఉపసర్పంచులు శ్రీనివాస్ గౌడ్,పాండు నాయక్,ఆమనగల్లు కౌన్సిలర్ ఎనుముల రమేష్,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్,మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి, నాయకులు జహంగీర్ అలీ,హెచ్.ఆర్.మహేష్,యూత్ వింగ్ అధ్యక్షుడు అంజి,రాములు యాదవ్, భీమ్లా నాయక్,శ్రీకాంత్ యాదవ్,జగదీష్ గౌడ్,శ్రీకాంత్ రెడ్డి,కార్తీక్ రెడ్డి,గొర్ల వంశీ,కిరణ్ గౌడ్,శేఖర్ గౌడ్, సుదర్శన్ యాదవ్,తిరుపతిరెడ్డి,సాయిబాబా చారి, రాయికంటి సురేష్,జంగారెడ్డి,శేఖర్ రెడ్డి, రాములు గౌడ్,యాదయ్య గౌడ్,బాల్‌రాజ్,చెన్నకేశవ,అండేకర్ రమేష్,బాలకృష్ణ,వెంకటేష్‌తో పాటు స్థానిక నాయకులు, వ్యాపారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు

### పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ.. సర్వమత ప్రార్థనలు




శేరిలింగంపల్లి, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గాంధీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు గణేష్ ముదిరాజ్, రఘునాథ్ రెడ్డి, మారబోయిన రాజు యాదవ్, అక్తర్, బాలింగ్ గౌతమ్ గౌడ్, రవీందర్ గౌడ్, తదితరులు గాంధీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జన్మదినం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీల్లో నాగ వైష్ణవికి స్వర్ణం



కీసర, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అక్టోబర్ 2 నుంచి 4 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రాంపల్లికి చెందిన పి. నాగ వైష్ణవి అండర్–59 కేజీల బాలికల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. తెలంగాణ రాష్ట్రానికి, రాంపల్లి గ్రామానికి పేరు తీసుకొచ్చిన వైష్ణవిని నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ వేణుగోపాల్, డివిజన్ ఉపాధ్యక్షుడు రామారం గిరి గౌడ్ ఘనంగా అభినందించారు. ఎంఎస్ తైక్వాండో అకాడమీ కోచ్ ఎం. మధుసూదన్ వద్ద శిక్షణ పొందిన వైష్ణవి మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి. శివకుమార్, ఎం. సంతోష్ కుమార్, అకాడమీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు పెంపునకు రాజకీయ పార్టీలు సహకరించాలి : కలెక్టర్ చంద్రశేఖర్

- అక్టోబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు



నల్గొండ అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టభద్రుల ఓటరు నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇంకా 2,195 మంది ఓటర్లకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన పెండింగ్‌లో ఉందని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలను ఇంటింటికీ వెళ్లి పరిశీలించి శుక్రవారం నాటికి ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్లు, బీఎల్ఓలను ఆదేశించినట్లు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**ఓటు హక్కు పొందేందుకు ప్రత్యేక శిబిరాలు:**

ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడిన వారు తిరిగి ఓటు హక్కు పొందేందుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ శిబిరాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉంటారని, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సైతం పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఓటర్ల పేర్ల తొలగింపు విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, నోటీసులు, బీఎల్ఏ నివేదిక తదితర ప్రక్రియలను అనుసరిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పట్టభద్రులను గుర్తించి ఫారం–18తో దరఖాస్తు చేయించాలి:**

వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించాలని కలెక్టర్ కోరారు. వారికి అవగాహన కల్పించి ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, కాంగ్రెస్ పార్టీ తరపున ముంతాజ్ అలీ, బీఆర్ఎస్ తరపున బక్క పిచ్చయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున అన్సారి, బీజేపీ తరపున లింగస్వామి, సీపీఎం తరపున నర్సిరెడ్డి, టీడీపీ తరపున తేలు అన్న రవి, అద్దంకి రవీందర్ పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ కొత్తపల్లి నరసింహ



సూర్యాపేట, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంజనాపురి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులను గురువారం వారు ప్రారంభించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే అవకాశమున్న 45 బ్లాక్ స్పాట్లను గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి భద్రతను మెరుగుపరచడంతో పాటు ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పలు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో పోలీసులు చేపడుతున్న రహదారి భద్రతా కార్యక్రమాలను అభినందించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా వాహనదారులు అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం కలుగుతుందన్నారు. రాత్రి వేళల్లోనూ బోర్డులు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు నిర్ణీత వేగ పరిమితిని పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాల్లో నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, ప్రమాద స్థలంలో తక్షణ సహాయం అందించేందుకు సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను కూడా బోర్డులపై పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాలకు ఆస్కారమున్న 45 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి బ్లాక్ స్పాట్‌కు ఇరువైపులా 100 మీటర్ల పరిధిలో రెండు హెచ్చరిక బోర్డుల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. రాబోయే దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో రహదారులపై వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రయాణికులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్చరిక బోర్డులను గమనిస్తూ ప్రమాదకర ప్రాంతాల్లో వేగాన్ని తగ్గించాలని, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను పాటించాలని కోరారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని, ప్రమాదాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 210 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- రూ.2.10 కోట్లకు పైగా విలువైన చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణం మరియు మండలానికి చెందిన 200 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 2,10,17,400 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. పేద కుటుంబాలకు ఆడబిడ్డల వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంద ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షులు గుండు నరేందర్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, అవుల దేవేందర్ రెడ్డి, సర్పంచులు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భూభారతి రీ–సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

- రైతులందరూ రీ–సర్వేను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా భూముల సర్వే అధికారి అల్కా కిషన్
- శేరి ఫైజాబాద్‌లో 257 ఎకరాల 16 గుంటల భూమికి రీ–సర్వే
- ప్రతి రైతు భూమికి ప్రత్యేక భూధార్ సంఖ్య కేటాయింపే లక్ష్యం
- భూ సమస్యల పరిష్కారానికి రైతుల వద్దకే అధికారులు
- నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ



చిలిపిచేడ్, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : రైతుల భూ హక్కుల పరిరక్షణకు,భూ రికార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి భూముల రీ–సర్వే కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా భూముల సర్వే అధికారి,అసిస్టెంట్ డైరెక్టర్ అల్కా కిషన్ పిలుపునిచ్చారు. భూముల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ రికార్డులను రూపొందించడం, ప్రతి రైతు భూమికి ప్రత్యేక భూధార్ సంఖ్య కేటాయించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. గురువారం చిలిపిచేడ్ మండలంలోని శేరి ఫైజాబాద్ (ఫైజాబాద్) గ్రామంలో సర్పంచ్ రాములు ఆధ్వర్యంలో భూభారతి భూముల రీ–సర్వేపై అవగాహన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్కా కిషన్ మాట్లాడుతూ..ప్రతి వ్యక్తికి ఆధార్ గుర్తింపు సంఖ్య ఉన్నట్లుగానే ప్రతి రైతు భూమికి ప్రత్యేక భూధార్ సంఖ్య ఉండాలని పేర్కొన్నారు. భూములకు భూధార్ నంబర్లు కేటాయించడం ద్వారా భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడమే భూభారతి కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. శేరి ఫైజాబాద్ గ్రామ పరిధిలోని మొత్తం 257 ఎకరాల 16 గుంటల భూమిని రీ–సర్వే చేయనున్నట్లు అల్కా కిషన్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ రికార్డులు ఉండాలని, భూములను సాగు చేస్తున్న వారి వివరాలను సైతం డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. భూ రికార్డుల్లో తలెత్తిన సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. 1923 నాటి చట్ట నిబంధనల ప్రకారం భూములకు సంబంధించిన మార్పులు, సమస్యల పరిష్కార ప్రక్రియ చేపడతామని వివరించారు. గ్రామకంఠంతో పాటు గ్రామ సరిహద్దులను పూర్తిస్థాయిలో సర్వే చేసి సంబంధిత వివరాలను గ్రామస్తులకు అందజేస్తామని తెలిపారు. రీ–సర్వే ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులకు అందజేసి సహకరించాలని కోరారు. అనంతరం నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ మాట్లాడుతూ..భూ సమస్యల పరిష్కారంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం అధికారులే నేరుగా రైతుల వద్దకు వచ్చి భూముల సర్వే నిర్వహించడంతో పాటు అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారని వివరించారు. భూముల సర్వే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న భూ రికార్డులు, సంబంధిత వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎదురయ్యే సందేహాలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతుల సహకారంతోనే భూభారతి రీ–సర్వే కార్యక్రమం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్,ఎంపీడీవో ప్రవీణ్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి,సర్వేయర్ రవిప్రసాద్,గ్రామ సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి,గ్రామ కార్యదర్శి నాగరాజు,గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం

- మెదక్ డిపిఓ యాదయ్య
- పాపన్నపేట సర్వసభ్య సమావేశానికి హాజరు
- శాఖల వారీగా నివేదించిన అధికారులు
- పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చిన సర్పంచులు



పాపన్నపేట, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : ఎల్ నినోను అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా ఎదుర్కోవాలని మెదక్ డిపిఓ యాదయ్య సూచించారు. గురువారం పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాల మట్టం తగ్గిపోయే ప్రమాదం ఉందని, సింగూర్ నుంచి డిసెంబర్ వరకు మాత్రమే తాగునీరు సరఫరా జరగనుందని ఆయా గ్రామాల సర్పంచ్లు, అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకుని ఉండాలన్నారు. వి బి జి రామ్ జి పథకం కింద అనేక నిధులు ఉన్నాయని, ఎల్ నినో సందర్భంగా అన్ని గ్రామాలలో ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో జీరో లేబర్ రిపోర్టు లేకుండా ఉండాలని, పని కల్పించకపోతే ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి ఎంపిఓలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నీటిబొట్టును ఆదా చేయాలన్నారు. ఘన వ్యర్థాలతోపాటు ఇద్దరు వ్యర్థాల నిర్వహణ కూడా ముఖ్యమన్నారు. ప్రజలు ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా సర్పంచులు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సూచనలు చేశారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు నివేదికలు వినిపించారు. పలు గ్రామాల సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ప్రధానంగా కరెంటు కోతలు, జాబ్ కార్డులు, సిసి రోడ్లు, తాగునీటిపై ప్రశ్నలు లేవనెత్తారు. రామతీర్థం సర్పంచ్ సాయిరెడ్డి గ్రామ శివారులోని మంజీర వంతెన అప్రోచ్ రోడ్డు గురించి, పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ వాటర్ ట్యాంక్ లీకేజీ, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల గురించి, ఆరేపల్లి సర్పంచి బతుకమ్మ చీరలు సకాలంలో అందించాలని, కొడపాక సర్పంచి గ్రామానికి రోడ్డు నిర్మాణం, ఆర్టీసీ బస్సు గురించి, దౌలాపూర్ సర్పంచి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగడంలేదని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అదే గదుల్లోనే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మహిళ సర్పంచుల పాత్రను స్థానిక తహశీల్దార్ సతీష్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిఎల్పిఓ యాదయ్య, ఎంపీడీవో విష్ణువర్ధన్, సర్పంచిగా ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశం,ఆయా గ్రామాల సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏడు సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు

## : జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య

**ఖమ్మం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** వానాకాలం 2026-27 ధాన్యం కొనుగోలు సీజన్ అక్టోబర్ 2026 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ, ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు సమయంలో ధాన్యం రకాన్ని సక్రమంగా గుర్తించి, అర్హులైన రైతులకు మాత్రమే బోనస్ ప్రయోజనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ మేరకు జిల్లాలోని ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రకాలను గుర్తించడంలో నైపుణ్యం కలిగిన కనీసం ఒక సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఆదేశించిందని, నియమితులయ్యే సిబ్బందికి వ్యవసాయంలో బి.ఎస్సీ లేదా డిప్లొమా విద్యార్హతతో ఉండేలా చూడనున్నామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ విధుల్లో పాల్గొనే అర్హత కలిగిన సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారితోషికం అందిస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారి లను సంప్రదించవచ్చన్నారు. నియమిత సిబ్బంది ధాన్యం కొనుగోలు సంస్థలకు సహకరిస్తూ, ప్రభుత్వం గుర్తించిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతారని జిల్లా వ్యవసాయ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అన్నం అమ్మ స్వరూపం

- అన్ని దానాల్లోకెల్ల అన్నదానం మిన్న : డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల
- పాత కొత్తగూడెంలో అమ్మవారిని దర్శించుకున్న కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి దంపతులు
- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల





**ఖమ్మం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** అన్నదానం అమ్మవారి స్వరూపం అని, అన్నిదానాల్లోకెల్ల అన్నదానం మిన్న అని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా కొత్తగూడెం కార్పొరేషన్ 11 వ డివిజన్ పరిధిలోని పాతకొత్తగూడెంలో ' టీం వారాహి' ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా బుధవారం రాత్రి అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్వాల, పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అమ్మవారికి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ అమ్మవారి సమక్షంలో, మండపాల్లో అన్నదానం చేస్తే అమ్మవారి కృప లభిస్తుందన్నారు. అమ్మ దయతో లోకమంతా సుభిక్షంగా ఉంటుందని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పడాల ఆకాంక్ష, కొత్వాల విమలాదేవి, భీమా శ్రీవల్లి, నాయకులు మేకల ప్రకాశరావు, జునుమాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూల పండుగలో పరిమళించిన ఆత్మీయత

- ఖమ్మం గణేష్ నగర్లో ఘనంగా అట్ల బతుకమ్మ సంబరాలు 150 మంది మహిళలకు బహుమతులు అందజేత





**ఖమ్మం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి చేసి, పాటలు, ఆటలతో వెల్లివిరిసిన ఆనందం. ఇలా ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ గణేష్ నగర్ లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ జిల్లా నాయకులు తోట రామారావు, తోట గోవిందమ్మ దంపతుల ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడి, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలు గణేష్నగర్లో పండుగ వాతావరణాన్ని నింపాయి. 150 మంది మహిళలకు బహుమతులువేడుకల్లో భాగంగా బతుకమ్మలతో పాల్గొన్న 150 మంది మహిళలకు బహుమతులు అందజేశారు. జి. జ్యోతి ప్రథమ, ఎం. ఉమా ద్వితీయ, సీహెచ్ మానస తృతీయ బహుమతులు అందుకున్నారు. మిగిలిన 147 మంది మహిళలకు కూడా ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ బహుమతుల కార్యక్రమంలో విజయ్ కుమార్, పగడాల నాగరాజు, మాటేటి కిరణ్, పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేసీ కృష్ణ, బచ్చు తోట రమేష్, డాక్టర్ తోట లక్ష్మణ్, రాంకీ శ్యాంబాబు, పోలెపొంగు వెంకట్, మేకల అనురాధ, నామ అనిత, కొండిశెట్టి పుణ్యవతి, పున్న అమల, గంధసిరి పద్మ, జలగం తిరుపతమ్మ, బీఎస్ఎన్ఎల్ వీరస్వామి, నామా తోకల ప్రభాకర్, విక్రమ్, శాబాస్ సాయి, అరవింద్, ఓంకారమ్మ, దేవబత్తిని రాము, సునీత, తరుణ్, శాబాస్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం



**ఖమ్మం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం కార్పొరేషన్ కి చెందిన టూ వీలర్ మెకానిక్ ఖుషీద్ గత 30 సంవత్సరాలుగా మెకానిక్ వృత్తిలో కొనసాగుతున్నాడు. గురువారం ఉదయం 6 గంటలకు ఖుషీద్ భార్య అనారోగ్యంతో మరణించడం తో విషయం తెలుసుకున్న వెంటనే ఖమ్మం టూ వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు తన సిబ్బందితో కలిసి యూనియన్ సభ్యుడు ఖుషీద్ ఇంటికి వెళ్లి, వారి భార్య భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం తక్షణ సాయం కింద ఖుషీద్ కుటుంబానికి రూ.10,000/- చెక్కును అందజేశారు. అనంతరం వంగాల కొండలరావు మాట్లాడుతూ యూనియన్ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్క మెకానిక్ కి ఎలాంటి సమస్యలు వచ్చిన యూనియన్ నుంచి సాయసహకారాలు ఉంటాయని, ప్రతి ఒక్క మెకానిక్ యూనియన్ లో సభ్యత్వం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లింగన బోయిన మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్, కోశాధికారి బల్లి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి షేక్ సుభాని, భైరవ శేషు ,మేడి పాండు, అన్నదేవర భద్రం , నాగుల్ మీరా తదితర మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- వైఫల్యాన్ని అధికారులపై నెట్టడం దురదృష్టకరం
- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే
- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**ఖమ్మం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రే అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, తన బాధ్యతను విస్మరించి అధికారులపై నెపం నెట్టడం బాధాకరమని సండ్ర వెంకట వీరయ్య అన్నారు. అధికారులపై పట్టు సాధించలేకపోతున్న ముఖ్యమంత్రి, "మీరు నా మాట వినట్లేదు" అంటూ వ్యాఖ్యానించడం పాలనలోని వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. గత నెల రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యకలాపాలకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు.

**కేసీఆర్ హయాంలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ కష్టాలు తప్పవన్న రీతిలో వ్యాఖ్యానించారని సండ్ర గుర్తుచేశారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ఒకప్పుడు విద్యుత్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణను విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 7,778 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 19,450 మెగావాట్లకు పెంచినట్లు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు సరఫరా, పంపిణీ వ్యవస్థలను కూడా విస్తృతంగా అభివృద్ధి చేశామని వివరించారు.ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, 400 కేవీ సబ్‌స్టేషన్ల సంఖ్యను 6 నుంచి 30కి, 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 103కి, 132 కేవీ సబ్‌స్టేషన్లను 176 నుంచి 251కి పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా ఈహెచ్ వి సబ్‌స్టేషన్ల సంఖ్యను 233 నుంచి 384కి పెంచడంతో పాటు, ఈహెచ్ టి లైన్ల సర్క్యూట్ పొడవును 16,378 కిలోమీటర్ల నుంచి 28,131 కిలోమీటర్లకు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 14,973 ఎం విఏ నుంచి 38,941 ఎంవిఏ కు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేశామని వివరించారు.

**కొత్త విద్యుత్ కేంద్రాలతో ఉత్పత్తి సామర్థ్యం పెంపు**

కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 42 నెలల్లో పూర్తి చేశామని, భద్రాద్రిలో 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని సండ్ర తెలిపారు. యాదాద్రిలో 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రం, భూపాలపల్లిలో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్ రంగంలో 6,480 మెగావాట్లు, సౌర విద్యుత్ రంగంలో 3,600 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని సమకూర్చినట్లు వివరించారు.గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన విద్యుత్ మౌలిక సదుపాయాలు, పనిచేసిన అధికార యంత్రాంగమే ప్రస్తుతం కూడా ఉన్నాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయో సమాధానం చెప్పాలని సండ్ర ప్రశ్నించారు. విద్యుత్ కొరతకు ఎల్‌నినో ప్రభావాన్ని కారణంగా చూపుతూ ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులను బాధ్యులుగా చూపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**రైతులకు న్యాయం చేయాలి, పంట నష్టానికి పరిహారం అందించాలి**

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. విద్యుత్ సమస్యలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని, అవసరమైన ప్రాంతాల్లో కరువు మండలాలను ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ రంగంలో గతంలో సాధించిన అభివృద్ధిని కొనసాగిస్తూ, ప్రస్తుత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు, అధికారులపై నిందలు వేయడం పక్కనపెట్టి, ప్రజలకు, రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు.ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమ్మరాజు, అమరవరపు కృష్ణారావు, మోదుగు పుల్లారావు, బెల్లంకొండ రాము, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు, మేకల నరసింహారావు, జొన్నలగడ్డ విజయ్, మోరంపూడి శివ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు: పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, అక్టోబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండే పోలీస్ సిబ్బంది కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు పోలీస్ హెడ్ క్వాటర్స్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కంటి చూపు సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వైద్య చికిత్స పొందడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.ఈ వైద్య శిబిరంలో పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారని, కంటి చూపు సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు తదుపరి చికిత్స పొందాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం కోసం శాఖ తరఫున అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ పాశం మహేష్, అడిషనల్ డీసీపీలు రామానుజం, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, డాక్టర్ పాశం మహేష్, ఆర్ఐలు కామరాజు, సురేష్, శ్రీశైలం, సాంబశివరావు పాల్గొన్నారు.

## సాలూరులో పొలిటికల్ ట్విస్ట్..



- సాలూరు మున్సిపల్ చైర్మన్ పదవి కోసం హడావుడిగా పెళ్లి చేసుకున్న టీడీపీ నేత
- పొత్తుల సర్దుబాటులో భాగంగా ఆ స్థానం జనసేన పార్టీకి కేటాయింపు
- పదవి కోసం పెళ్లి చేసుకున్నా ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశలో యువ నేత

**సాలూరు (జర్నలిస్ట్ ఫైల్ ):**ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో టికెట్ల కోసం ఆశావహులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో జరిగిన ఓ 'పొలిటికల్ పెళ్లి' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే ఆశతో ఓ యువ నేత హడావుడిగా పెళ్లి చేసుకున్నా, పొత్తుల రాజకీయం అతడి ఆశలపై నీళ్లు చల్లింది.

**ఏం జరిగిందంటే?:** సాలూరుకు చెందిన టీడీపీ యువ నేత, మాజీ కౌన్సిలర్ వైకుంఠపు హర్షవర్ధన్‌కు రాజకీయంగా మంచి పట్టుంది. అతడి తండ్రి వైకుంఠపు పంచముఖి కూడా గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. దీంతో ఈసారి మున్సిపల్ ఛైర్మన్ పదవి తనకే దక్కుతుందని హర్షవర్ధన్ ధీమాతో ఉన్నారు. అయితే, ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లతో సీన్ మొత్తం మారిపోయింది. సాలూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. దీంతో అతడికి ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. అయినా పట్టు వదలకుండా, పదవిని తమ కుటుంబానికే దక్కించుకోవాలని హర్షవర్ధన్ ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను ఎనిమిదేళ్లుగా ప్రేమిస్తున్న గుళ్ల మంజీరాను వెంటనే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. వాస్తవానికి మరో ఆరు నెలల్లో వీరి పెళ్లి జరగాల్సి ఉంది. కానీ, రిజర్వేషన్ సమీకరణాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు, ముహూర్తాలు కూడా చూడకుండా, బంధువులను సైతం పిలవకుండా హడావుడిగా మంజీరా మెడలో తాళి కట్టారు. తన భార్య ద్వారా ఎలాగైనా ఛైర్‌పర్సన్ టికెట్ సాధించి, పరోక్షంగా పీఠాన్ని దక్కించుకోవాలని ప్లాన్ చేశారు.

**కూటమి దెబ్బతో నిరాశ:** హర్షవర్ధన్ ప్రణాళిక బాగానే ఉన్నా, రాజకీయ పరిణామాలు ఆయనకు అనుకూలించలేదు. టీడీపీ–జనసేన కూటమి పొత్తుల సర్దుబాటులో భాగంగా, ఆయన ఆశలు పెట్టుకున్న సాలూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించారు. ఎన్నో ఆశలతో, అత్యంత వేగంగా పెళ్లి చేసుకున్న హర్షవర్ధన్‌కు ఈ పరిణామం తీవ్ర నిరాశను మిగిల్చింది.

మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి విధేయుడిగా, బలమైన సామాజిక వర్గం అండ ఉన్నా, పొత్తుల రాజకీయం ముందు అతడి వ్యూహం ఫలించలేదు. పదవి కోసం ప్రేమను, పెళ్లిని ఉపయోగించుకోవాలనుకున్న యువ నేత టికెట్ కథ ఇలా ఊహించని విధంగా ముగియడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

## మంత్రి కందుల దుర్గేష్ కృషితో అభివృద్ధి దిశగా 'కాల్దరి' గ్రామం

- రెండున్నరేళ్లలో రూ.5.83 కోట్లతో అభివృద్ధి పనులు



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి, నిడదవోలు శాసనసభ్యులు కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించడంతో ఉండ్రాజవరం మండలంలోని కాల్దరి గ్రామం అభివృద్ధి దిశగా పయనిస్తోంది. గత రెండున్నరేళ్ల స్వల్ప కాలంలోనే గ్రామాభివృద్ధి కోసం ఏకంగా రూ. 5.83 కోట్లు కేటాయించి పనులను వేగవంతం చేశారు. పల్లె పండుగ 1.0 క్రింద రూ. 29.50 లక్షల వ్యయంతో 9 అభివృద్ధి పనులు చేపట్టగా ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. పల్లె పండుగ 2.0 క్రింద రూ. 43 లక్షల వ్యయంతో 2 పనులు చేపట్టగా ఆ పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామంలోని ఇంటింటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా రూ. 90 లక్షల నిధులతో జల్ జీవన్ మిషన్ పనులను శరవేగంగా పూర్తి చేయిస్తున్నారు. గ్రామీణ మౌలిక వసతుల కోసం పంచాయతీ నిధులు రూ. 42.08 లక్షలు, మండల ప్రజా పరిషత్ నిధులు రూ. 6 లక్షలు, రూ. 13 లక్షల డీఎంఎఫ్ నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. రూ. 50 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ ను నిర్మిస్తున్నారు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు రూ. 12 లక్షల వ్యయంతో 6 గోకులం షెడ్లు ఏర్పాటు చేశారు. రూ. 1.78 కోట్ల శాస్కి నిధులతో కాల్దరి నుండి వెలివెన్ను వెళ్లే దారిలో అత్తిలి కాలువ గట్టును పటిష్టం చేస్తున్నారు. రూ. 60 లక్షల ఆర్ అండ్ బి నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

రూ. 55 లక్షల జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నిధులతో గ్రామంలో ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆసరాగా కల్పిస్తూ గ్రామంలోని ఇద్దరు బాధితులకు రూ. 7.05 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ చెక్కులను మంజూరు చేయించి స్వయంగా అందజేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాల్దరి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ చేస్తున్న ప్రయత్నాలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డిండి ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమమే : డీకే అరుణ హెచ్చరిక

- పాలమూరు నీటిని డిండికి తరలించి రైతులను మోసం చేస్తున్నారని డీకే అరుణ ఆరోపణ



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటిని డిండికి తరలించి, స్థానిక రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌లో పాలమూరు–రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకు? అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయడం ద్వారా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్... ఆర్డీఎస్ కోసం చేసిందేమీ లేదని డీకే అరుణ దుయ్యబట్టారు. రైతులు, అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పాలమూరు రైతుల నీటి హక్కులను కాపాడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## బ్రహ్మంగారిమఠం అమ్మవారి శాలలో వైభవంగా ధనలక్ష్మిదేవి అలంకారం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బ్రహ్మంగారిమఠం పట్టణంలోని అమ్మవారి శాలలో ఆరవ రోజు శ్రీ వాసవీమాత అమ్మవారు ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్ అమ్మవారితో పాటు ఉత్సవమూర్తి అమ్మవారిని ధనలక్ష్మి దేవి అలంకారంలో సర్వాంగసుందరంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో సందడి నెలకొంది.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి వివిధ రూపాల్లో ప్రత్యేక అలంకారాలు నిర్వహిస్తుండటంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతూ అమ్మవారి కృపాకటాక్షాలు పొందుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి నామస్మరణలు, పూజా కార్యక్రమాలతో మైదుకూరు అమ్మవారి శాలలో పండుగ వాతావరణం నెలకొంది

**ప్రత్యేక అలంకరణగా శ్రీ చండికా పరమేశ్వరి అమ్మవారు**

భక్తుల పాలిట కల్పవల్లిగా సకల శుభాలను ప్రసాదించే శ్రీ చండికా పరమేశ్వరి అమ్మవారు బ్రహ్మంగారిమఠం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులకు దివ్యదర్శనం ఇవ్వడం విశేషం

ఈ ప్రత్యేక అలంకరణలో ఉభయ దాతలుగా బింగి నరహరి పబ్బతి కృష్ణయ్య మాకం సుబ్బారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెనాలి పురపాలక సంఘంలో ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ!



**తెనాలి,అక్టోబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్ ):**తెనాలి పురపాలక సంఘ పరిధిలో రెండవ సాధారణ పురపాలక ఎన్నికలకు సంబంధించి ఉదయం 14 మంది ఎన్నికల అధికారులు 14 మంది అదనపు ఎన్నికల అధికారులు, 14 మంది సహాయ ఎన్నికల అధికారులు సంయుక్తంగా ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రచురించారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ అనంతరం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈరోజు మొత్తం 4 నామినేషన్లు అందాయి. అవి 10వ, 14వ, 20వ, 50వ వార్డులకు సంబంధించినామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలు తాడిబోయిన రాధిక,గుంటూరు కోటేశ్వరరావు, కఠారి వెంకటేశ్వరరావు,గద్దేటి బాల భాస్కరరావు

**సింగిల్ విండో సెల్ ద్వారా సేవలు!**

అభ్యర్థులకు అవసరమైన ధృవీకరణ పత్రాలు, అనుమతులను సులభంగా అందించేందుకు తెనాలి పురపాలక కార్యాలయంలో సింగిల్ విండో సెల్ ఏర్పాటు చేయబడింది. ఇప్పటివరకు పురపాలక సంఘం ద్వారా మొత్తం 130 నో డ్యూస్ సర్టిఫికెట్లు జారీ చేయబడ్డాయి. సింగిల్ విండో సెల్‌లో వివిధ సేవల కోసం సంబంధిత అధికారులకు బాధ్యతలు కేటాయించారు.

రిటర్నింగ్ ఆఫీసర్ నో డ్యూస్ సర్టిఫికెట్ల జారీ, పురపాలక పన్నుల బకాయిల పరిశీలన, ధృవీకరణ. సబ్ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థుల ర్యాలీలు, డీజే సౌండ్ తదితరాలకు అవసరమైన అనుమతులు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన చర్యలు.

ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ విద్యుత్ బిల్లుల పెండింగ్ బకాయిల పరిశీలన. అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు తమ ఓటు వివరాలను సులభంగా తెలుసుకునేందుకు, నామినేషన్ పత్రాలను సక్రమంగా పూరించేందుకు పురపాలక కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయబడింది.

అభ్యర్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

## వినుకొండ మున్సిపల్‌లో తొలి రోజు మూడు నామినేషన్లు దాఖలు

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 16న మూడు నామినేషన్లు నమోదయ్యాయి.

అధికారిక వివరాల ప్రకారం: 2వ వార్డు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎన్. ఏడుకొండలు, 6వ వార్డు: స్వతంత్ర అభ్యర్థిగా కిషోర్ దేవరపల్లి, 32వ వార్డు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నాగూర్ వలి షేక్ అత్తర్ నామినేషన్లు సమర్పించారు. దాఖలైన మొత్తం మూడు నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి రెండు, స్వతంత్ర అభ్యర్థి తరపున ఒకటి ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు.

## పుంగనూరు ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం

- వైఎస్సార్ జిల్లా వాలంటీర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా నల్లపురెడ్డి ప్రశాంత్ రెడ్డి



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** పుంగనూరు గడ్డపై జరిగిన అమానుష పిరికిపంద దాడిని తీవ్రంగా ఖండిస్తూ మీ ముందుకు వచ్చాను. ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకునేలా పట్టపగలు జరిగిన ఈ దాష్టీకాన్ని రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై టీడీపీ గూండాలు పక్కా ప్లాన్‌తో సాగించిన హత్యాయత్నం ఇది. ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్ కార్యక్రమానికి వెళ్తుండగా దారి కాచి కత్తులు, రాళ్లు, కర్రలతో కాన్వాయ్‌పై విరుచుకుపడ్డారు. 10 వాహనాలను ధ్వంసం చేసి, స్వయంగా ఎంపీపై వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలపై ప్రాణాంతక దాడికి ఒడిగట్టారు.

నేను టీడీపీ నాయకత్వాన్ని, చంద్రబాబు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నాను?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కూడా ప్రతిపక్ష నేతలకు లేదా? ప్రజల్లో ఆదరణ లేక, ఎన్నికల్లో గెలిచే సత్తా లేక ఇలా కత్తులు, రాళ్లతో ప్రత్యర్థులను అంతమొందించాలని చూస్తారా?

పదుల సంఖ్యలో రౌడీలు నడిరోడ్డుపై స్వైరవిహారం చేస్తూ దాడి చేస్తుంటే పోలీస్ యంత్రాంగం ప్రేక్షకపాత్ర ఎందుకు వహించింది? చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిని నిలువరించాల్సింది పోయి చేష్టలుడిగి చూడటం దేనికి సంకేతం? రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడున్నాయి?

ఎన్నికలు అంటే ప్రజాతీర్పు కోరడమా, లేక అమాయక కార్యకర్తల, ప్రజాప్రతినిధుల రక్తం పారించడమా?

టీడీపీ మూకలకు మేం స్పష్టంగా హెచ్చరిస్తున్నాం

ఇలాంటి దాడులకు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజల తరఫున నిలబడతాయి. రక్తపాత రాజకీయాలతో ప్రజల గొంతును నొక్కేయలేరు.

ఈ హత్యాయత్నానికి కారకులైన ప్రతి ఒక్క టీడీపీ గూండాను తక్షణమే అరెస్ట్ చేయాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సాగుతున్న ఈ అరాచక పాలనపై రాష్ట్ర ప్రజలు తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదు.

చట్టం ముందు దోషులు నిలబడే వరకు బాధితులకు న్యాయం జరిగే వరకు మేము పోరాటం ఆపేది లేదు అని కడప జిల్లా వాలంటీర్స్ వింగ్ సెక్రటరీ నల్లపరెడ్డి ప్రశాంత్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు

# ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు...

- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు!
- ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం దృష్టి
- ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు
- బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి
- డీఎంకే సహా పలు పార్టీల మద్దతు కోసం కేంద్రం ప్రయత్నాలు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :**
మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.

ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది.

**రెండు వంతుల మెజారిటీ అవసరం**

రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులుండగా, మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు కీలకం. ఈ లెక్కన సుమారు 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్డీయేకు లోక్‌సభలో మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం విషయంలో సవాళ్లు ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వానికి మద్దతు పెరిగిందని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపు మారారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలంపై తుది స్పష్టత ఓటింగ్ సమయంలోనే రానుంది.

**డీఎంకేతో చర్చలు**

బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమిళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో ఆ పార్టీ విభేదాలు రావడం, ఇండియా కూటమి నుంచి బయటకు రావడం నేపథ్యంలో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ కేంద్రం మాట్లాడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించలేదు.

దీంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని సమాచారం. అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలకు వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# మైదుకూరులో 144 సెక్షన్ మరియు 30 యాక్ట్ అమలు..

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు
- పోలీసుల ముఖ్య సూచనలు
- నలుగురికి మించి గుమికూడరాదు..
- చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
- మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు పట్టణ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచనల మేరకు మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి పట్టణ ప్రజలకు పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సంయమనం పాటించాలని, పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. పట్టణ పరిధిలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమతి లేని సమావేశాలు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా నలుగురికి మించి ఒకచోట గుమికూడడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు:** ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ ఇతర నిషేధాజ్ఞలు, పోలీసు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించే వారు సంబంధిత అధికారుల అనుమతులు, నిబంధనలు పాటించాలి.

రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం సంయమనం పాటించాలి. ప్రత్యర్థి పార్టీలపై దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గొడవలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలి.

సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, నిరాధార ఆరోపణలు, రెచ్చగొట్టే పోస్టులు, ప్రజలను తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేయరాదు.

ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడరాదు.

పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గొడవలు జరిగే అవకాశం ఉన్నా, శాంతిభద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలి.

ఈ సందర్భంగా సీఐ హాజీవలి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేసినా, ఇతరులను రెచ్చగొట్టి గొడవలకు కారణమైనా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు చిరంజీవి కత్తి వెంకటరమణ పాల్గొని ప్రజలకు ఎన్నికల సమయంలో పాటించాల్సిన నిబంధనలు, పోలీసు శాఖ సూచనలను వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని వారు సూచించారు.

మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని మైదుకూరు అర్బన్ సీఐ హాజీవలి పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన



- రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం
- పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు
- కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని అంచనా
- ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా ప్రకారం.. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, విశాఖపట్నం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది.

వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని హెచ్చరించారు. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# ఎన్జీవో హోమ్‌లు ఉద్యోగుల దేవాలయాలు





- 75 ఏళ్లుగా ఉద్యోగుల సేవలో ఎన్జీజీవో సంఘం
- ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదు
- అనకాపల్లి నూతన భవన ప్రారంభోత్సవంలో ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్

**అనకాపల్లి, అక్టోబర్ 16(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్జీవో హోమ్‌లు ఉద్యోగుల దేవాలయాలని, గత 75 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ఎన్జీజీవో సంఘం ఉద్యోగుల సంక్షేమం కోసం విశేష సేవలందిస్తోందని ఏపీఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. అనకాపల్లి జిల్లాలో నూతనంగా నిర్మించిన ఎన్జీవో హోమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఎన్జీవో హోమ్‌లు కేవలం ఉద్యోగుల సంఘ భవనాలు మాత్రమే కావని, ఉద్యోగుల ఉద్యమాలకు, సమావేశాలకు, సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువులుగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులతో పాటు గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ భవనాలు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వీలైనంత వరకు ఉచితంగా సేవలు అందించాలని, భవనాల నిర్వహణలో నాయకత్వం క్రమశిక్షణ, పారదర్శకత పాటించాలని సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా తమ నాయకత్వంలో యువతకు 30% ఎన్జీజీవో సంఘంలో అవకాశాలు కల్పించామని దానివల్ల సంఘంలో యువతరం పెద్ద ఎత్తున పనిచేస్తుందని తెలిపారు.

అతి తక్కువ సమయంలోనే జిల్లా, నగర శాఖలకు భవనాలను సమకూర్చుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైన అనకాపల్లి జిల్లా కార్యవర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆమనగంటి శ్రీరాములు, సుధాకర్ ప్రసాద్ వంటి మహనీయ నాయకులతో పాటు అనేకమంది జిల్లా, తాలూకా స్థాయి నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఎన్జీవోల సంఘాన్ని బలోపేతం చేసి, భవనాలను నిర్మించి ఉద్యోగులకు సేవలందించారని విద్యాసాగర్ గుర్తుచేశారు. వారి కృషిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత తరం నాయకులు ఎన్జీవో హోమ్‌లను కాపాడుకుంటూ, వాటిని ఉద్యోగుల సేవకు అంకితం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎన్జీవోల సంఘం ఎప్పుడూ రాజీపడబోదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇప్పటికే అనేక సమస్యలను పరిష్కరించామని, మిగిలిన డిమాండ్ల సాధనకు కూడా రాజీలేని పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

**ఉద్యోగుల వైద్య సేవలు, పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి:** రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య కార్డులు, వైద్య సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో పురోగతి సాధించే దిశగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరు చేయించే అంశంలోనూ ఎన్జీవోల సంఘం కృషిచేసి అనుకున్నది సాధించింది అని తెలిపారు. పెన్షనర్లు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై రాష్ట్ర నాయకత్వాన్ని అభినందించడం, ఆశీర్వదించడం ఆనందంగా ఉందన్నారు.

**ఘనంగా నూతన భవన ప్రారంభోత్సవం**

అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణలకు ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉద్యోగులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ఎన్జీవో హోమ్‌కు చేరుకున్నారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరవడంతో పాటు బైక్ ర్యాలీ, బాణసంచా, మహిళల నృత్యాలతో ఎన్జీవో హోమ్ పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

రాష్ట్రనాయకులు నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొని శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనకాపల్లి జిల్లా ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానల్‌ను కూడా ప్రారంభించారు.

తదనంతరం ఎస్.ఆర్. శంకరన్న సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జేఏసీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

**ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర నాయకత్వానికి ప్రశంసలు** గత ఏడాది కాలంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ ఉత్తర్వుల విడుదలకు రాష్ట్ర నాయకత్వం చేసిన కృషిని పలువురు వక్తలు ప్రశంసించారు. పీఆర్సీ, ఉద్యోగుల ఆరోగ్య కార్డుల కింద ప్రత్యక్ష చెల్లింపులు, పెన్షనర్ల అదనపు పెన్షన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, సరెండర్ లీవ్ తదితర అంశాల్లో సంఘం ఉద్యోగుల పక్షాన నిలబడి కృషి చేసిందని పేర్కొన్నారు.

భవన నిర్మాణం, పునర్నిర్మాణ కార్యక్రమాల్లో భాగస్వాములైన యువజన నాయకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన అనకాపల్లి జిల్లా మహిళా విభాగాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్జీవోల నాయకులు భారతి ప్రసాద్, సుబ్బారెడ్డి, రాజు, వేణుగోపాల్, భోం జయ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆనందబాబు, పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు కిషోర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు మాధవరావు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్, అనకాపల్లి జిల్లా కార్యదర్శి శేషు కుమార్, ఎన్జీవో మహిళా విభాగం రాష్ట్ర చైర్మన్ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోగుల భద్రత కమిటీల ఏర్పాటు

- కేంద్ర మార్గదర్శకాల మేరకు 11 కీలక అంశాలపై కమిటీల పర్యవేక్షణ
- చికిత్సలో పొరపాట్ల నివారణ, వైద్య సేవల నాణ్యత పెంపునకు డీఎంఈ చర్యలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోగుల భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పడ్డాయి. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాల మేరకు రోగుల భద్రతకు ప్రత్యేక అధికారులను నియమించడంతోపాటు, 11 కీలక అంశాలపై పర్యవేక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేశారు. డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ ఆదేశాల మేరకు వీటి ఏర్పాటు రాష్ట్రంలోని అన్ని బోధనాసుపత్రుల్లో జరిగింది.

**రోగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం**

ఆసుపత్రుల్లో చికిత్స పొందే రోగులకు సురక్షితమైన వైద్య సేవలు అందించడం, చికిత్స సమయంలో పొరపాట్లు, నివారించదగిన ప్రమాదాలను తగ్గించడం రోగుల భద్రతలో కీలకం. మందుల వినియోగం, శస్త్రచికిత్సలు, రక్త మార్పిడి, వైద్య పరికరాల వినియోగం, ప్రయోగశాల పరీక్షలు, ఆసుపత్రుల్లో ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ వంటి అంశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక పర్యవేక్షణ అవసరం. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సంబంధిత విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ కమిటీలు దోహదపడతాయి. మొత్తం 11 అంశాలను కమిటీ పర్యవేక్షిస్తుంది. ప్రతి అంశానికి సంబంధిత వైద్య ప్రత్యేక విభాగం నుంచి ఒక అధ్యాపకుడిని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించారు.

**మార్గదర్శకాల అమలుకు ఆదేశాలు**

కమిటీల ఏర్పాటు, వాటి పనితీరుపై సంబంధిత బోధనాసుపత్రుల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ విష్ణువర్ధన్ పేర్కొన్నారు. రోగుల భద్రతకు సంబంధించిన మార్గదర్శకాలను సమర్థంగా అమలు చేస్తూ, ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కమిటీల స్వరూపం**

రాష్ట్రంలోని అన్ని బోధనాసుపత్రుల్లో ఈ కమిటీలు ఏర్పడ్డాయి. వీటిల్లో ముఖ్యమైన స్పెషాలిటీ వైద్యులందరూ సభ్యులుగా ఉన్నారు. ఈ క్రమంలో అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మందుల భద్రతకు డాక్టర్ శరణ్ సోనియా, శస్త్రచికిత్సల భద్రతకు డాక్టర్ ఏ. నవీన్ కుమార్, రక్త మార్పిడి భద్రతకు డాక్టర్ వి. శివశంకర్ నాయక్, వైద్య పరికరాల భద్రతకు డాక్టర్ పి. మధు, ప్రయోగశాలల భద్రతకు డాక్టర్ శాంతి రెడ్డిని నియమించారు.

ఇన్‌ఫెక్షన్ల నియంత్రణకు డాక్టర్ రామస్వామి నాయక్, వైద్య పరిశోధనకు డాక్టర్ ఎస్. ఉమా మహేశ్వరరావు, రోగులు-కుటుంబ సభ్యుల భాగస్వామ్యానికి డాక్టర్ వి. కిషోర్ కుమార్, టీకాల భద్రతకు డాక్టర్ ఎం. రవి కుమార్, ఆసుపత్రి సౌకర్యాల భద్రతకు డాక్టర్ ఎల్. బ్రహ్మానందం, ఆయుష్ సేవలకు డాక్టర్ జి. నారాయణ స్వామిని ఎంపిక చేశారు.

ఇలాగే మిగిలిన ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో కమిటీలు సీనియర్ వైద్యులు సభ్యులుగా ఉన్నారు.

## మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా.. ముగ్గురి అరెస్ట్

- నకిలీ యూఎల్‌సీ పత్రాలతో అక్రమ భూ రిజిస్ట్రేషన్లు
- మేడ్చల్ జిల్లాలో ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ. 6 లక్షలు వసూలు
- నిందితుల నుంచి నకిలీ పత్రాలు, స్టాంప్ పేపర్లు స్వాధీనం
- జీడిమెట్ల పరిధిలో వెలుగు చూసిన మోసం



**మేడ్చల్(జర్నలిస్ట్ ఫైల్):** నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రీతిలో భూముల రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును మేడ్చల్ పోలీసులు రట్టు చేశారు. ఈ మోసానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి కీలకమైన నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల ప్రాంతంలో ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

నిందితులు ప్రధానంగా నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) క్లియరెన్స్ పత్రాలను రూపొందించారు. వీటిని ఆధారంగా చేసుకుని జీడిమెట్ల ప్రాంతంలోని సర్వే నంబర్లు 192, 193లో గల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు.

ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నిందితులు సుమారు రూ. 6 లక్షల మేర వసూలు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు రెండు అక్రమ రిజిస్ట్రేషన్లను వీరు పూర్తి చేసినట్లు అధికారులు గుర్తించారు.

ఈ భారీ మోసంపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ యూఎల్‌సీ పత్రాలతో పాటు స్టాంప్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలలో ఇటీవల భూ సంబంధిత అక్రమాలు పెరుగుతున్న తరుణంలో అధికారులు నిఘాను మరింత తీవ్రతరం చేశారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా? వీరు గతంలో మరిన్ని మోసాలకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన గోవిందమాంబ

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 5వ రోజు గోవిందమాంబ అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారికి మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములు వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడమైనది ఉదయం సుప్రభాత సేవ సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమం షష్టమ అఖండ స్థాపనము మఠం తాత్కాలిక ఆధ్వర్యులు ఇడమకంటి జనార్ధనాచార్య పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు భక్తులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు.

"ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## మైదుకూరులో తొలి రోజు ఏడు నామినేషన్లు

- వైసీపీ నుంచి ఐదు..
- టీడీపీ నుంచి రెండు దాఖలు

**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మైదుకూరు మున్సిపాలిటీలో శుక్రవారం తొలి రోజు 7 నామినేషన్లు దాఖలయ్యాయి.

వీటిలో వైఎస్సార్‌సీపీ తరఫున 5 టీడీపీ నుంచి 2 నామినేషన్లు నమోదయ్యాయి. ఇతర పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలు కాలేదు.

మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులు ఉండగా ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. రానున్న రెండు రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశముంది.

# అంగారకుడిపై ఇళ్ల నిర్మాణం.. 3డీ ప్రింటింగ్‌తో 'సజీవ' ఇటుకలు!

- 'సజీవ' నిర్మాణ పదార్థాన్ని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు
- మార్స్ మట్టి, జెలాటిన్, ఈస్ట్‌తో తయారీ
- అక్కడి చలి, తక్కువ పీడనంలోనే గట్టిపడే స్వభావం
- తక్కువ శక్తితో నిర్మాణం, పునర్వినియోగం చేసే సౌలభ్యం



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** అంగారక గ్రహంపై భవిష్యత్తులో మానవ ఆవాసాల ఏర్పాటు దిశగా శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. హాంకాంగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు అంగారకుడిపై 3డి ప్రింటింగ్ సాంకేతికతతో గృహాలను నిర్మించేందుకు వీలైన ఒక ప్రత్యేకమైన 'సజీవ' నిర్మాణ పదార్థాన్ని అభివృద్ధి చేశారు. మార్స్ మట్టి, జెలాటిన్, జన్యుమార్పిడి చేసిన ఈస్ట్‌ను ఉపయోగించి దీనిని రూపొందించారు. ఈ వినూత్న ఆవిష్కరణ ద్వారా అరుణ గ్రహంపై తక్కువ శక్తితో, స్థానిక వనరులను వినియోగించుకుంటూనే నివాసాలను నిర్మించుకునే అవకాశం లభించనుంది.

అంగారకుడిపై ఉండే అత్యంత శీతల వాతావరణం, తక్కువ పీడన పరిస్థితుల్లో ఈ పదార్థం దానంతట అదే గట్టిపడుతుంది. ఫ్రీజ్-డ్రైడ్ పండ్ల తయారీ ప్రక్రియ నుంచి స్ఫూర్తి పొంది దీనిని అభివృద్ధి చేసినట్లు పరిశోధకులు వెల్లడించారు. ఈ మిశ్రమంలోని నీరు తొలుత గడ్డకట్టి, ఆపై తక్కువ పీడనం వద్ద నేరుగా ఆవిరిగా మారుతుంది. దీనివల్ల తేలికైన, దృఢమైన 'ఫోమ్' వంటి నిర్మాణం ఏర్పడుతుంది. సాధారణంగా మార్స్‌పై భవన నిర్మాణానికి మట్టిని 1,000 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వేడి చేయాల్సి ఉంటుందని, దానికి భారీగా శక్తి అవసరమని, అయితే ఈ నూతన పద్ధతికి అటువంటి అవసరం లేదని సీనియర్ పరిశోధకుడు జిషెన్ క్వియు వివరించారు. ఈ మిశ్రమంలోని జన్యుమార్పిడి చేసిన 'శాకరోమైసెస్ సెరివిసియే' అనే ఈస్ట్, జిగురులా పనిచేసే ప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది మట్టి కణాలను బలంగా బంధించడానికి దోహదపడుతుంది. మార్స్ వాతావరణాన్ని ప్రతిబింబించే ప్రత్యేక చాంబర్‌లో 3డి ప్రింటర్ ద్వారా ముద్రించినప్పుడు ఈ పదార్థం గట్టిపడుతుంది. ప్రయోగశాల పరీక్షల్లో ఈ పదార్థం 10 నుంచి 12 మెగాపాస్కల్స్ సంపీడన బలాన్ని (తక్కువ గ్రేడ్ కాంక్రీట్‌తో సమానం), 6 మెగాపాస్కల్స్ వంపు బలాన్ని ప్రదర్శించింది. ఈ బలంతో భూమిపై ఒకటి లేదా రెండు అంతస్తుల భవనాలను నిర్మించవచ్చని, అంగారకుడిపై గురుత్వాకర్షణ శక్తి తక్కువ కాబట్టి బహుళ అంతస్తుల నిర్మాణాలు కూడా సాధ్యమవుతాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ సాంకేతికత ప్రయోగశాల దశలోనే ఉంది. పరిశోధకులు వైన్ కార్క్ పరిమాణంలో (సుమారు 45 మి.మీ. ఎత్తు) చిన్న డోమ్ నమూనాలను సిద్ధం చేశారు. ఈ పదార్థాన్ని విచ్ఛిన్నం చేసి, తిరిగి ప్రాసెస్ చేయడం ద్వారా పునర్వినియోగించుకునే సౌలభ్యం ఉండటం విశేషం. దీనివల్ల భూమి నుంచి భారీ నిర్మాణ సామగ్రిని మార్స్‌కు తరలించాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఈ పరిశోధన వివరాలు 'కెమ్ సర్క్యులారిటీ' అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).

Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com